

భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రామస్వామినాయుడు



కురిమిన రామస్వామినాయుడు

భీమునిపట్నం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పద్మనాభం మండలానికి చెందిన కురిమిన రామస్వామినాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. రామస్వామినాయుడు పద్మనాభం జనసేన అధ్యక్షునిగా ఉన్నారు. ఆయన వారంలోకి ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిసింది.

విజయవంతంగా స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు



తొలి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అందిస్తున్న డీఐజీ బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు, జాయింట్-1 వెంకయ్యనాయుడు, జాయింట్-2 కనకరత్నం

- తొలిరోజు 50 రిజిస్ట్రేషన్లు పూర్తి

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల కోసం కొత్తగా ప్రవేశ పెట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని విశాఖపట్నంలో శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఒక్కరోజే 50 స్లాట్ల ద్వారా 50 రిజిస్ట్రేషన్లు చేశారు. సూపర్ బజార్ ప్రాంగణంలోని ఆర్ఓలో ఈ కార్యక్రమాన్ని డీఐజీ బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు దగ్గరుండి పర్యవేక్షించారు. ఇక్కడి ఆర్ఓలో జాయింట్-1, జాయింట్-2 ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉండడంతో రోజుకు 39 స్లాట్లు చొప్పున 78 స్లాట్లు బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఆ విధంగా శుక్రవారం 50 రిజిస్ట్రేషన్లు చేసినట్టు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ వెంకయ్యనాయుడు తెలిపారు. వచ్చిన వారికి కొత్త విధానం కోసం చెప్పి, హెల్ప్ డెస్క్ ద్వారా స్లాట్లు బుక్ చేయించి, సీరియల్ వారీగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్టు వివరించారు. వచ్చిన వారు కూడా ఈ విధానం బాగుందని, ఇకపై సూచించిన సమయానికే వస్తామని, ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేదని పేర్కొనడం గమనార్హం.

అమెరికన్ నేవీ సందడి



యుద్ధ నౌకలో ఆయుధాలు ప్రదర్శిస్తున్న అమెరికన్ నేవీ

టైగర్ ట్రయంఫ్-2025లో పాల్గొనడానికి వచ్చిన అమెరికన్ నేవీ, సైనిక సిబ్బంది సుమారు మూడు వేల మంది ఇక్కడి తూర్పు నౌకాదళంతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. - వివరాలు మెయిన్ ఎడిషన్‌లో...

100 ఎకరాలకు స్కెచ్

భీమన్నదొరపాలెం భూములపై పెద్దల కన్ను

- కొన్ని డి.పట్టాభూములు
- మరికొన్ని రైతుల ఆక్రమణలో ఉన్నవి...
- ఆక్రమణలో ఉన్నా రికార్డుల్లో నమోదుకానివి ఇంకొన్ని
- మొత్తం చేజిక్కించుకునేందుకు ఓ గ్యాంగ్ యత్నం
- ఎకరాకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఇస్తామని బేరాలు
- తరువాత ప్రభుత్వ అవసరాలకు అప్పగించి భారీగా లబ్ధి పొందే కుట్ర



భీమన్నదొరపాలెంలో రైతుల ఆధీనంలో ఉన్న భూములు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

ఆనందపురం మండలం భీమన్నదొరపాలెం సర్వే నంబర్-1లో రైతుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను కొట్టేయడానికి నగరానికి చెందిన ఓ గ్యాంగ్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ గ్యాంగ్‌కు మండలంలో కొందరు అధికార పార్టీ నేతలు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు మాయమాటలు చెప్పి ఎకరాకు రూ.15 నుంచి రూ.20 లక్షల చొప్పున ముట్టజెప్పి మొత్తం భూములు కొట్టేయాలని స్కెచ్ వేశారనే ప్రచారం సాగుతోంది.

భీమన్నదొరపాలెంలో సర్వే నంబర్-1లో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఏళ్ల క్రితం గ్రామంలోని రైతులు వీటిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. వీరిలో కొందరికి అప్పట్లో ప్రభుత్వం డి-పట్టాలు ఇచ్చింది. మిగిలిన వారిలో కొందరి పేర్లు రెవెన్యూ రికార్డుల్లో (4-సీ) ఆక్రమణదారులుగా నమోదయ్యాయి. మరి కొంత భూమి పలువురు రైతుల ఆధీనంలో ఉన్నప్పటికీ వారికి డీపట్టాలు ఇవ్వలేదు. ప్రభుత్వ రికార్డుల్లో ఆక్రమణదారులుగా నమోదు కాలేదు. రెవెన్యూ పరిభాషలో ఇటువంటి ... మిగతా 6వ పేజీలో

కార్పొరేటర్ల కలెక్షన్!

సింహాచలం కారిడార్‌లో 22 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికుల నియామకానికి గత కమిషనర్ ఆమోదం

- వెంటనే అమ్మకానికి పెట్టిన కొందరు స్థానిక ప్రజా ప్రతినిధులు
- రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల చొప్పున వసూలు
- ఆప్కోస్‌లో చేర్పిస్తామంటూ ఆశావహులకు హామీ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీలో తాత్కాలిక పారిశుధ్య కార్మికుల పోస్టులను కూడా కొందరు కార్పొరేటర్లు అమ్ముకుంటున్నారు. ఫలానాచోట పారిశుధ్యం బాగోలేదని... సిబ్బందిని నియమించాలని వారే అధికారులకు వినతి పత్రం ఇచ్చి...ఆమోదం రాగానే ఆశావహుల నుంచి డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు ఇస్తున్నారు. తాజాగా జోన్-8 పరిధిలోని సింహాచలం కారిడార్‌లో 22 మంది తాత్కాలిక పారిశుధ్య కార్మికుల నియామకానికి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సింహాచలం బీఆర్‌టీఎస్ కారిడార్‌లో రాత్రి పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో తెల్లవారేసరికి అపరిశుభ్రంగా కనిపిస్తున్నదంటూ కొందరు కార్పొరేటర్లు మూడు నెలల కిందట జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లన్నీ చెత్తాచెదారంతో నిండివుండడంతో సింహాచలం వెళ్లే భక్తులకు అసౌకర్యం కలుగుతుందని వివరించారు. కమిషనర్ దీనిపై పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ ప్రధాన వైద్యాధికారితోపాటు జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. రాత్రిపూట రోడ్లను పరిశుభ్రం చేసే సిబ్బంది లేరని జోనల్ కమిషనర్ వివరించడంతో 22 మందిని రోజువారీ వేతనంపై నియమించుకునేందుకు కమిషనర్ అనుమతించారు. దీనిని ఆసరాగా తీసుకుని కొందరు కార్పొరేటర్లు...ఆశావహులను పిలిచి జీవీఎంసీలో ఉద్యోగాలంటూ నమ్మించారు. ఒక ప్రజా ప్రతినిధికి తాను ప్రధాన అనుచరుడినని, ఆయనతో చెప్పి ఉద్యోగం వచ్చేలా చేస్తానంటూ ఒక కార్పొరేటర్ ఏకంగా ఒక్కో పోస్టుకు రూ.1.5 లక్షలు వసూలు చేసినట్టు తెలిసింది.

తనకు కూడా పోస్టులు ఇవ్వాలని పొరుగు వార్డు కార్పొరేటర్ ఒకరు పట్టుబట్టడంతో కొన్ని కేటాయించినట్టు సమాచారం. ఆయన తన కోటాగా వచ్చిన పోస్టులను రూ.లక్ష చొప్పున విక్రయించినట్టు ప్రచారం జరుగుతోంది. కొంత మంది జీవీఎంసీలో ఏం ఉద్యోగాలని ప్రశ్నించగా...పారిశుధ్య నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుందని, ఇంటికి దగ్గరల్లోనే పని ఉంటుందని, ప్రస్తుతం రోజుకు రూ.450 చొప్పున ఇస్తారని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ పని అందులోనూ రోజువారీ కూలీ ఉద్యోగానికి రూ.1.5 లక్షలు ఎందుకని కొందరు ప్రశ్నించగా, తనకు తెలిసిన ... మిగతా 6వ పేజీలో

ఇంటి దొంగలు

పేదల కాలనీలో పెద్దోళ్లకు ఇళ్లు!

- జెర్రిపోతులపాలెం జగనన్న కాలనీలో అనర్హులకు స్థలాలు/ ఇళ్లు కేటాయించినట్టు నిర్ధారణ
- 79 మందిని గుర్తించిన రెవెన్యూ యంత్రాంగం
- వాటిని రద్దు చేస్తూ నిర్ణయం
- నేతల ఒత్తిడితో మంజూరుచేసిన అధికారులు
- అప్పటి తహసీల్దారు, వీఆర్వోపైనా చర్యలకు రంగం సిద్ధం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జెర్రిపోతులపాలెం జగనన్న కాలనీలో అడ్డగోలుగా కేటాయింపులు

- ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, సైనికులకు మంజూరు
- వైసీపీ నేత ప్రోద్బలంతోనే...
- స్థానికులు ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోని వైనం
- తాజాగా విచారణ
- మొత్తం 134 మందిలో 60 మంది అనర్హులు ఉన్నట్టు గుర్తింపు



మార్చి 27న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో అనర్హులకు ఇళ్లను కేటాయించిన వ్యవహారంపై అధికారులు చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. నిరుపేద వర్గాలకు చెందిన వారికి మంజూరు చేయాల్సిన ఇళ్లు, స్థలాల జాబితాలో సంపన్నులకు చోటు కల్పించిన వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఈ మేరకు పెందుర్తి మండలం జెర్రిపోతుల పాలెంలో 79 మంది అనర్హులకు ఇళ్లు కేటాయించినట్టు తేల్చారు. వారికి మంజూరుచేసిన ఇళ్లను రద్దు చేయడంతో పాటు, అప్పటి తహసీల్దారు, వీఆర్వోపైనా చర్యలు తీసుకోనున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల కాలనీల పేరిట నగర శివార్లలో భారీ లే అవుట్లు వేశారు. అయితే జెర్రిపోతులపాలెంలో అనర్హులకు ఇళ్లు, స్థలాలు కేటాయించారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసి పింఛన్ తీసుకుంటున్నవారు, బహుళ అంతస్థులు, నాలుగు చక్రాల వాహనాలు కలిగినవారు ఉన్నారు. జాబితా రూపొందించిన సమయంలోనే స్థానికులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసి, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఫలితంగా వారందరికీ ఇళ్లు మంజూరయ్యాయి. గ్రామంలో మొత్తం 134 మందికి ప్లాట్లు కేటాయించగా వారందరికీ గృహ నిర్మాణ సంస్థ ఇళ్లు మంజూరుచేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ తీసుకునేవారు, బహుళ అంతస్థుల భవనాలు కలిగినవారు పట్టా మంజూరుకు అనర్హులు. కానీ అధికారులపై గ్రామానికి చెందిన ఓ వైసీపీ నేత ఒత్తిడి తేవడంతో నిబంధనలకు వ్యతిరేకంగా పెందుర్తి తహసీల్దారు ఐదేళ్ల క్రితం పట్టాలు మంజూరుచేశారు.

గ్రామీణ ప్రాంతం కావడంతో ఒక్కొక్కరికి 1.5 సెంట్ల విస్తీర్ణంతో పట్టా ఇచ్చారు. ప్రతి లబ్ధిదారుడికీ ఇంటి నిర్మాణం కోసం రూ.1.8 లక్షల చొప్పున మంజూరుచేశారు. పట్టాల మంజూరు వ్యవహారంలో అవకతవకలు జరిగాయని అప్పట్లో గ్రామస్థులు ... మిగతా 6వ పేజీలో

సిటీలో 3 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు

- మధురవాడ, ముడసర్లోవ, గాజువాకల్లో ఏర్పాటు
- తొలిదశలో 350 మందికి వసతి
- రూ.178 కోట్లు మంజూరుచేసిన కేంద్రం

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు చేసే మహిళల కోసం నగరంలో హాస్టళ్ల ఏర్పాటుకు కేంద్రం ముందుకువచ్చింది. ప్రధానంగా అవివాహితులు, ఒంటరి మహిళల కోసం మూడుచోట్ల వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నెలకొల్పడానికి రూ.178 కోట్లు మంజూరుచేసింది. జిల్లా యంత్రాంగం చేసిన ప్రతిపాదనల మేరకు కేంద్రం ఈ నిధులు కేటాయించింది. మధురవాడ, ముడసర్లోవ, గాజువాకల్లో ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల ఏర్పాటుచేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఒక్కొక్క హాస్టల్‌లో తొలిదశలో 350 మందికి వసతి కల్పించనున్నారు. భవిష్యత్తులో వసతి సౌకర్యాన్ని మరింత పెంచేలా నిర్మాణాలు చేపడతారు. మూడు హాస్టళ్ల నిర్మాణం పూర్తయిన తరువాత పీపీపీ విధానంలో నిర్వహించనున్నారు. ముడసర్లోవలోవ హాస్టల్‌ను ఆరిలోవ హెల్త్ సిటీలోని ఆస్పత్రుల యాజమాన్య కమిటీ, అలాగే మధురవాడ హాస్టల్‌ను ఐటీ కంపెనీల అసోసియేషన్,గాజువాక హాస్టల్‌ను ఫార్మా కంపెనీల అసోసియేషన్ నిర్వహించేలా ఒప్పందాలు చేసుకునే యోచనలో ఉన్నారు.

నర్సు పోస్టులకు ఫేక్ సర్టిఫికెట్లు!

వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో 370 ఖాళీల భర్తీకి మూడు నెలల కిందట నోటిఫికేషన్

- 8,300 మంది దరఖాస్తు
- కొవిడ్ సమయంలో పని చేయకుండానే చేసినట్టు సర్టిఫికెట్లు జత చేసిన పలువురు అభ్యర్థులు
- గుర్తించిన అధికారులు
- కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కళాశాల, శ్రీకాకుళంలోని జనరల్ ఆస్పత్రి పేర్లతో జారీ
- తుది దశకు ఎంపిక ప్రక్రియ... దళారుల రంగ ప్రవేశం



వైద్య, ఆరోగ్య శాఖ ఆర్‌డీ కార్యాలయం

- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న ఆర్డీ డాక్టర్ రాధారాణి

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):

వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయాలని భావించిన అధికారులకు ఫేక్ సర్టిఫికెట్ల వ్యవహారం తలనొప్పిగా మారింది. తాము కొవిడ్ సమయంలో పనిచేసినట్టు కొందరు ఫేక్ సర్టిఫికెట్లను సమర్పించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ధారించుకోవాల్సి రావడంతో నియామక ప్రక్రియ ఆలస్యం అవుతోంది.

ఆర్డీ కార్యాలయ పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 106 స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేసేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేయగా, సుమారు 8,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత మరికొన్ని ఖాళీలను గుర్తించారు. దాంతో పోస్టుల సంఖ్య 370కు చేరింది. భారీగా వచ్చిన దరఖాస్తులను వడపోసిన అధికారులు కొందరు ఫేక్ సర్టిఫికెట్లు (కరోనా సమయంలో పని చేయకుండానే చేసినట్టు) జత చేసినట్టు గుర్తించారు. ఆయా సర్టిఫికెట్లను మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులకు ... మిగతా 6వ పేజీలో

షాలిమార్-చెన్నై ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా షాలిమార్-చెన్నై సెంట్రల్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 02841 నంబరు గల రైలు ఈ నెల 7 నుంచి 21 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 6.30 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.08 గంటలకు దువ్వాడ, అదేరోజు రాత్రి 11.30 గంటలకు చెన్నై సెంట్రల్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 02842 నంబరు గల రైలు ఈనెల 9 నుంచి 23 వరకు ప్రతి బుధవారం ఉదయం 4.30 గంటలకు చెన్నైలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.30 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 11.20 గంటలకు షాలిమార్ చేరుతుంది. ఈ సర్వీసులు సంత్రాగచ్చి, ఖరగ్‌పూర్, భువనేశ్వర్, విజయనగరం, దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, గూడూరు మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

పూర్ణామార్కెట్ ప్రాంతం ప్రక్షాళన

- పోలీస్ కమిషనర్ ఆదేశాలతో రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు
- ఏళ్లతరబడి పాతుకుపోయిన వారిని సైతం ఖాళీ చేయించిన పోలీసులు
- స్థానికులు, వాహనచోదకులు హర్షం



ఆక్రమణలు తొలగించాల్సిందిగా మైకులో హెచ్చరికలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు

మహరాణిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో ఉక్కిరిబిక్కిరిగా ఉండే పూర్ణామార్కెట్ ప్రాంతం ఎట్టకేలకు ఊపిరి పీల్చుకుంది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం పోలీసులు పెద్దసంఖ్యలో రంగంలోకి దిగి ప్రధాన రహదారులపై ఉండే ఆక్రమణదారులను ఖాళీ చేయించారు. వన్‌టౌన్ సీఐ జి.దేముడుబాబు ఆధ్వర్యంలో బృందాలు మైకులో హెచ్చరికలు చేస్తూ పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు, చుట్టుపక్కల రహదారులపై ఆక్రమణదారులను ఖాళీ చేయించారు. మూడు దశాబ్దాల కిందట ఆక్రమించిన వారిని సైతం వెళ్లగొట్టారు. వాహనాలు సాఫీగా వెళ్లకుండా రహదారులను ఆక్రమించేశారని, అడిగిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని పోలీస్ అధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. దీనిపై నెల కిందట పోలీస్ కమిషనర్ చొరవ తీసుకుని ఆక్రమణలు తొలగింపజేశారు. అయితే ఇటీవల ఓ చోటా నేత ఆధ్వర్యంలో మళ్లీ యథావిధిగా ... మిగతా 6వ పేజీలో

7 నుంచి 'ఎన్‌టీఆర్ వైద్య సేవ'లు బంద్

స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) నిర్ణయం

- బకాయిలు చెల్లిస్తే తప్ప వైద్య సేవలు అందించలేమని ప్రకటన

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులను క్లియర్ చేయకపోవడంతో ఈ నెల ఏడో తేదీ నుంచి 'ఎన్‌టీఆర్ వైద్యసేవ' కింద సేవలను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) నిర్ణయించింది. జిల్లాలో ఎన్‌టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో 108 ఆస్పత్రులు ఉండగా, అందులో 82 ప్రైవేటు ఆస్పత్రులు. ఆయా ఆస్పత్రుల్లో ప్రతిరోజూ కనీసం వేయి మంది వరకూ సేవలు పొందుతుంటారు. ఒక్కో ఆస్పత్రికి కనీసం రూ.50 లక్షల నుంచి రూ.15 కోట్లు వరకూ రావలసి ఉంది. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టమవుతోందని యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో వైద్య సేవలు నిలిపివేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు అసోసియేషన్ చెబుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి బకాయిలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తరువాత కొంతమేర చెల్లింపులు జరిపినప్పటికీ ఇంకా రాష్ట్రవ్యాప్తంగా మూడు వేల కోట్లకుపైగా బకాయిలు ఉన్నట్టు చెబుతున్నారు. జిల్లాలోని ఆస్పత్రులకు రూ.100 కోట్ల వరకూ రావలసి ఉందని పేర్కొంటున్నారు. అవి చెల్లిస్తేనే తప్ప సేవలు ... మిగతా 6వ పేజీలో


కల్యాణం చేస్తున్న అర్చకులు

కమనీయం .. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

సీతారాముల కల్యాణానికి పందిరి రాట


మద్దిలో పెళ్లిరాట వేస్తున్న భక్తులు

మధురవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని టైలర్స్ కాలనీలో ఉన్న విజయదుర్గాదేవి ఆలయం ఆవరణలో శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం పందిరి రాట వేశారు. ఆలయ ధర్మకర్త బాంగారు లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో రాట వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఈనెల 6న సీతారాముల కల్యాణం సందర్భంగా శుక్రవారం పెళ్లి రాట ఘనంగా నిర్వహించారు. రామాలయం వద్ద పురోహితులు సామవేదం బదరికా వాసు, సీతారాము ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు అనంతరం పెళ్లి రాట వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు తులసి లక్ష్మి, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ దంపతులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీను, కోటి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం రేపు

ఎండాడ : ఎండాడలో ఉన్న కోదండ రామాలయం, షిర్డీసాయి, గణపతి, పశుపతి నాథేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 6వ తేదీన సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు ఎండాడ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాదు రాజు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరుగుతాయని, అనంతరం సీతారాముల కల్యాణం చేస్తామని వివరించారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ఎండాడ,ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) :ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల మాతృ మరణాలు సంభవిస్తాయని, పుట్టే శిశువులు ఆరోగ్యకరంగా జన్మించరని చెప్పారు. కార్యక్రమంలో భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ బి. సరిత, పాఠశాల హెచ్ఎం శైలజ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొమ్మాది : బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ఇప్పటికీ అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పీఎంపాలెం లక్ష్మీవానిపాలెం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బాల్య వివాహాల నిర్మూలన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మణరావు, ఆర్‌హెచ్ కాలనీ పాఠశాల హెచ్ ఎం రమాదేవి, సోమశేఖర్, రాధ, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

ఆనందపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 6వ తేదీన బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు కెఎస్‌పీ చక్రవర్తి, వేదుల దక్షిణామూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం వెల్లంకి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షురాలు పిల్లా విజయ ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6న అన్ని గ్రామా ల్లోనూ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండల కమిటీని, మోర్చ అధ్యక్షులను నియమించారు. సమావేశంలో నాయకులు ప్రసాదరావు పట్నాయక్, ఉప్పాడ అప్పారావు, రామానాయుడు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు

భారీగా హాజరైన దరఖాస్తుదారులు


ఆనందపురంలో అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు

పద్మనాభం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్లలో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ, కాపు కార్పొరేషన్, ఆర్థికంగా వెనుకబడిన వారు, జెనెరిక్ మెడికల్ షాపులకు సంబంధించి 115 యూనిట్లు మంజూరు కాగా 374 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంటర్వ్యూలకు 342 మంది హాజరయ్యారు. అర్హుల జాబితాను తయారు చేసి బ్యాంకులకు పంపిస్తామని ఎంపీడీఓ విజయకుమార్ చెప్పారు.

ఆనందపురం : మండలంలోని వేములవలస, ఆనందపురం, వెల్లంకి, చందక పంచాయతీల్లో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ జానకి మాట్లాడుతూ నాలుగు పంచాయతీలకు సంబంధించి 203 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారని, మిగిలిన పంచాయతీలకు 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. 26 పంచాయతీలకు 848 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు.

ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం పరిశీలన


పరేడ్‌ను పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ

విశాలాక్షినగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయుధగారం, మోటార్ ట్రాన్స్‌పోర్టు విభాగం, డాగ్ స్క్వాడ్, వీఐపీ సెక్యూరిటీ, వెల్ఫేర్ విభాగం రికార్డులను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపర్చుకోవాలని డీఐజీ అధికారులకు సూచించారు. తొలుత పోలీసు పరేడ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అలానే సెరిమోనియల్ పరేడ్, స్క్వాడ్రిల్, ఆర్మ్‌డ్ డ్రిల్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. దేవప్రసాద్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి సంజీవరావు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం



సింహాచలం కాంప్లెక్స్‌లో కార్మికులతో అప్పలనాయుడు

సింహాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెలలో జరిగే అప్పన్న స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు, చందనోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన సింహాచలం కాంప్లెక్స్‌లో పునర్నిర్మించిన సులాబ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టు కార్మికులంతా చిత్తశుద్ధితో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని, పరిసరాలను, బస్సులను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు.అలాగే అప్పన్న స్వామి వార్షికోత్సవాల సందర్భంగా సింహగిరి ఘాట్ రోడ్డులో తిరిగే బస్సుల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మంచి కండీషన్‌లో ఉన్న బస్సులను మాత్రమే ఘాట్‌రోడ్డులో ప్రయాణికుల సేవలకు వినియోగించాలన్నారు. భద్రాద్రి రామన్న ఉత్సవాలకు ఈనెల ఐదారు తేదీ ల్లో ద్వారకా బస్ కాంప్లెక్స్ నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కమ్ సింహాచలం డిపో మేనేజర్ కె. రాజశేఖర్, డీఈఈ నరసింహారావు, ఏఈ కొం డలరావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం రేపు

పద్మనాభం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ విశాఖ నగర కన్వీనర్ వేదుల దక్షిణామూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పద్మనాభం లోని పార్టీ కార్యాలయంలో మండల ఇన్‌చార్జి రూపాకుల రవికుమార్ అధ్యక్షతన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షురాలు టి. నాగమణి, నాయకులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సోమేశ్వరరావు, ఎం.గౌరీ రెడ్డి, పి. కృష్ణారావు పాల్గొన్నారు.

నూకాలమ్మకు పూజలు

భీమునిపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజల ఆరాధ్య దేవత నూకాలమ్మ మారువారం సందర్భంగా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమి లి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు జరిపారు. కాగా ఆర్య వైశ్య యువజన సంఘం సభ్యులు గుడి వద్ద భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. సబ్బిశెట్టి రాఘవ ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు ఎం. సునీల్, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమి టీ అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు, సబ్బిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగిసిన శిక్షణ

భీమునిపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాసిన వంద మంది విద్యార్థు లకు భీమిలిలో మూడు రోజుల పాటు భవిష్యత్తు ప్రణాళికకు సంబంధించి నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. వాసవీ కల్యాణ మండపంలో ఎస్ఎఫ్ఐ, విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్త సహకారంతో ఈ శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు భవిష్యత్తు ప్రణాళికల గురించి, రెండవ రోజు సమాజంలో మత ప్రభావం గురించి, మూడో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కి నివాళి


జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొమ్మాది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని చం ద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొట్టేటి రవి అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



సింహాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో దేవేర్లు సింహవల్లీ తాయార్, సువర్ణ, చతుర్భుజి తాయార్ అమ్మవార్ల తిరువీధి శుక్ర వారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ముగ్గురమ్మల ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలాపనలు, అధ్యాపకుల పురాణ పఠనాల నడుమ బేడా మండపంలో తిరువీధి ఉత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రపై ప్రచారం

పద్మనాభం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్‌కే బీచ్‌లో ఈనెల 12న జరిగే హనుమాన్ శోభాయాత్ర గురించి ఉత్సవ కమిటీ సభ్యులు రెడ్డిపల్లి, పొట్నూరు గ్రామాల్లో శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఉత్సవంలో భాగంగా హనుమాన్ బైక్ ర్యాలీ జరగనుందని, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, హనుమాన్ శోభాయాత్ర ప్రతినిధులు సీతారాం, సూర్యచంద్రరావు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలసలో ఉన్న శుభశ్రీ కల్యాణ మండ పంలో హనుమాన్ బైక్ ర్యాలీ పోస్టర్‌ను ఉత్సవం కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధి తమ్మిన నరసింగరావు మాట్లాడుతూ ఈనెల 12న ఆర్‌కే బీచ్‌లో జరగనున్న హనుమాన్ శోభాయాత్రకు బైక్ ర్యాలీలు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. ర్యాలీలో ఆనం దపురం, పద్మనాభం, భీమిలి మండలాల నుంచి యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

త్వరలో కుటుంబ సాధికారిక సారథుల ఎంపిక

సింహాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో కుటుంబ సాధికారిక సారథుల నియామకం త్వరలో చేపడతామని కార్పొరేటర్ పివి నరసింహం చెప్పారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన పార్టీ సమావేశంలలో ఆయన మాట్లాడారు. వార్డులో సుమారు నాలుగు వేల మంది సభ్యత్వం తీసుకున్నారని, వారందరికీ కార్డులు పంపిణీ చేశామని చెప్పారు. అలాగే 60 మంది ఓటర్లకు ఇద్దరు కుటుంబ సాధికారిక సారథుల నియామకం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మేకా కాసుగోపాల్, గుసిడి శంకరరావు, అవినాష్‌బాబు జి, రౌతు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కరపత్రాలు పంపిణీ


పోస్టర్లు చూపిస్తున్న స్థానికులు, సీపీఐ నాయకులు

మధురవాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 11న నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఏడో వార్డు పరిధిలోని మల్లయ్యపాలెంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉచిత ఆటోలను పునరుద్ధరించాలి'

సాగర్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో పర్యాటకుల సౌకర్యార్థం జీవీఎంసీ గతంలో అందుబాటులో ఉంచిన ఉచిత ఆటో సర్వీసులను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా సందర్శకులను పర్యాటక ప్రాంతాలకు ఉచితంగా చేరవేసేందుకు జీవీఎంసీ గతంలో పది ఆటోలు ఏర్పాటు చేసింది. ఇవి పర్యాటకులకు ఎంతో సౌలభ్యంగా ఉండేవి. సాగర్‌నగర్ నుంచి అప్పుఘర్, చినవాల్తేరు, పెద్దవాల్తేరు, లాసెన్స్‌బే కాలనీ, బీచ్‌రోడ్డు మీదుగా ఆర్కే బీచ్ వరకు పర్యాటకులను ఆటోల్లో ఉచితంగా చేరవేసేవారు. ఈ సర్వీసులు దివ్యాంగులకు, స్థానికులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. డ్రైవర్లకు నెల రోజులుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఉచిత సర్వీసులు నిలిపివేసినట్టు తెలిసింది. పాలకులు, అధికారులు స్పందించి ఆటో సర్వీసులను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

7 నుంచి 'ఎన్టీఆర్ వైద్య సేవ'లు బంద్

... 5వ పేజీ తరువాయి

అందించలేమని ఆస్పత్రులు యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అందువల్ల రోగులు తమను అర్థం చేసుకుని సహకరించాలని 'ఆషా' ఒక లేఖను విడుదల చేసింది. దీనిపై ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. అప్పారావును వివరణ కోరగా.. ఉన్నత స్థాయి నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాలేద న్నారు. ప్రస్తుతానికి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో యథావిధిగా వైద్యుడిగా పని చేస్తున్నారు.

శ్మశాన వాటిక సమస్యలపై జడ్సీ ఆరా

మల్కాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలో జోన్ 5 కమిషనర్ రాము శుక్రవారం పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మల్కాపురం శ్మశనవాటికను పరిశీలించి, అక్కడ సమస్యలపై ఆరా తీశారు. మృతదేహాల ఖనానికి గోతులలు తవ్వేటప్పుడు మరో మృతదేహం బయటపడితే వెంటనే దాన్ని పూడ్చేయాలని లేదా స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

దీపికకు జనసేన నాయకుల పరామర్శ

కొమ్మాది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రేమోన్మాది నవీన్ చేతిలో తీవ్రంగా గాయపడి నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దీపికను భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ శుక్రవారం పరామర్శించారు. దీపిక ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాడికి పాల్పడిన నిందితుడు ఇప్పటికే రిమాండ్‌లో ఉన్నాడని, విచారణ అనంతరం ప్రభుత్వం శిక్షిస్తుందన్నారు.


చిప్పాడలో సమావేశమైన టీడీపీ ముఖ్య నాయకులు

దివీస్‌లో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి : టీడీపీ

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ గ్రామంలో ఉన్న దివీస్ కంపెనీలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ మండల ముఖ్య నాయకులు చిప్పాడలోని సాయిబాబా గుడి వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు డి. అప్పలనరసింహరాజు మాట్లాడుతూ కంపెనీ వల్ల 20 ఏళ్లుగా పరిసర ప్రాంతాల ప్రజలు కాలుష్యానికి గురవుతున్నారని చెప్పారు.వ్యవసాయం లేకపోవడం, చేపల వేట సాగకపోవడం, భూగర్భ జలాలు కలుషితం వంటి సమస్యల వల్ల ఎంతో మంది వలస వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ కంపెనీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని, స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన సిఫార్సు లేఖలకు కూడా విలువ లేకుండాపోయిందని చెప్పారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు సరగడ అప్పారావు మాట్లాడుతూ కంపెనీలో ఉద్యోగ అవకాశాలకు భరోసా లేకపోతే పార్టీ తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం కంపెనీ వల్ల ఏర్పడుతున్న సమస్యలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లాలని నాయకులు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పతివాడ రాంబాబు, అన్నవరం మాజీ సర్పంచ్ మైలపల్లి లక్ష్మణరావు, నాగమయ్యపాలెం ఎంపీటీసీ మాజీ సభ్యుడు పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

100 ఎకరాలకు స్కెచ్

... 5వ పేజీ తరువాయి

భూములను నాన్ 4-సీగా పిలుస్తారు. అంటే హక్కులు లేకున్నా భూములు సదరు రైతుల ఆధీనంలో ఉన్నట్టు.మొత్తం మూడు కేటగిరీలుగా ఉన్న భూములను అధికారికంగా క్రయవిక్రయాలు చేపట్టేందుకు అవకాశం లేదు.

రంగంలోకి గ్యాంగ్

జాతీయ రహదారికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ భూములపై పెద్దల కన్ను పడింది. ఒకేచోట 100 ఎకరాలు ఉండడంతో కొందరు ముఠాగా ఏర్పడి కొద్దిరోజులుగా రైతులతో మంతనాలు సాగిస్తున్నారు. డీపట్టాలు ఇప్పిస్తామని, తమకే విక్రయించాలని స్థానిక అధికార పార్టీ నేతల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. అంతేకాదు ఎకరాకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఇస్తామని బేరాలు సాగిస్తున్నారు. ఈ భూములు మొత్తం కొనుగోలు చేసిన తరువాత అధికార పార్టీలో కీలక నేతల ద్వారా పైరవీ చేసుకుని క్రమబద్ధీకరణ చేయించుకోవచ్చునని భావిస్తున్నారు. ఇటీవల ఈ ముఠా గ్రామానికి తరచూ వెళ్లి రైతులతో చర్చలు జరుపుతోంది.

4-సీ క్రమబద్ధీకరణ ఎలా?

గతంలో డీపట్టా భూములను వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేయడం పెద్ద వివాదమైంది. దీనిపై చేపట్టిన విచారణ కొలిక్కిరాలేదు. ఈ సమయంలో డీపట్టా లేకుండా కేవలం ప్రభుత్వ రికార్డులలో ఆక్రమణదారులుగా గుర్తించిన (4-సీ) భూములను క్రమబద్ధీకరణ చేయడం సాధ్యమేనా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

కారుచౌకగా భూములు చేజిక్కించు కుని తరువాత వీఎంఆర్‌డీఏ లేదా ప్రభుత్వ అవసరాలకు ఇస్తే భారీగా లబ్ధి పొందవచ్చుననే ఉద్దేశంతో నగరానికి చెందిన గ్యాంగ్ ఈ భూములపై కన్నేసిందనే వాదన వినిపిస్తోంది.

ఇంటి దొంగలు

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేసినా పెందుర్తి తహసీల్దారు పట్టించుకోలేదు. అయితే స్పందించిన గృహ నిర్మాణ సంస్థ అధికారులు మాత్రం 20 మందిని అనర్హులుగా గుర్తించి, కేటాయించిన ఇళ్లను రద్దు చేశారు. మిగిలిన 114 ఇళ్లకు పలు దఫాలుగా నిధులు మంజూరుచేశారు. గృహ నిర్మాణ సంస్థ కేటాయింపులతో సంబంధం లేకుండా లేఅవుట్‌లో 178 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. కొన్ని ఇళ్లు పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. గ్రామంలో ఎక్కువ మంది అనర్హులకు ఇళ్లు మంజూరుచేయగా, కేవలం 20 మందినే జాబితా నుంచి తప్పించి, మిగిలిన వారికి అనుమతి ఇచ్చిన వ్యవహారం వెనుక గృహనిర్మాణ సంస్థ అధికారుల పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఇటీవల 'పెద్దలకు పేదోళ్ల ఇళ్లు' శీర్షికన 'ఆంధజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా యంత్రాంగం, గృహ నిర్మాణ సంస్థలు స్పందించాయి. దీనిపై రెవెన్యూశాఖ అధికారులు విచారణ చేపట్టగా 79 మంది అనర్హులున్నట్టు తేలింది. మూడు రోజుల క్రితం జిల్లా హౌసింగ్ పీడీ సత్తిబాబు కాలనీని సందర్శించారు. దీంతో వారికి కేటాయించిన ఇళ్లను రద్దు చేయాలని నిర్ణయించారు. ఇదిలావుండగా అనర్హులకు పట్టాలు మంజూరుచేసిన అప్పటి పెందుర్తి తహసీల్దారు, ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం భావిస్తున్నట్టు సమాచారం.

కార్పొరేటర్ల కలెక్షన్!

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే ద్వారా పోస్టులన్నీ ఆప్కోస్‌లో చేరేలా చేస్తానంటూ భరోసా ఇచ్చినట్టు తెలి సింది. పోస్టులన్నీ అమ్ముకున్న కార్పొరేటర్లు...వా రిని విధుల్లోకి తీసుకోవాలంటూ జోనల్ కమిషనర్ తోపాటు ప్రధాన వైద్యాధికారిపై ఒత్తిడి తేవడం ప్రారంభించారు. దీనికి ఇన్‌చార్జి కమిషనర్ అనుమతి అవసరం కాబట్టి, ఫైల్‌ను ఆయనకు పంపించామంటూ ఇంతవరకూ అధికారులు తాత్సారం చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ నుంచి ఆమోదం రావడంతో ఈనెల రెండో తేదీ నుంచి 22 మంది తాత్కాలిక సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నారు. తాత్కాలిక పారిశుధ్య కార్మికుల పోస్టులు విక్రయించుకున్నారనే ఆరో పణలను జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా నిబంధనల ప్రకారమే వారందరినీ విధుల్లోకి తీసుకున్నామని, డబ్బులు వసూలు చేశారనే విషయం తెలియదని బదులివ్వడం విశేషం.

నర్స్ పోస్టులకు ఫేక్ సర్టిఫికెట్లు!

... 5వ పేజీ తరువాయి

పంపించి పునఃపరిశీలన చేయించారు. ఇప్పటివరకూ 14 మంది జత చేసినవి ఫేక్ కొవిడ్ సర్టిఫికెట్లుగా అధికారులు నిర్ధారించారు. మరికొన్ని నిర్ధారణ కావాల్సి ఉందని చెబుతున్నారు. కాగా, ఇప్పటికే గుర్తించిన 14 ఫేక్ సర్టిఫికెట్లు కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీ, శ్రీకాకుళంలోని జనరల్ ఆస్పత్రి నుంచి తెచ్చినట్టుగా అధికారులు నిర్ధారించారు. ఈ సర్టిఫికెట్లు అందించేందుకు అక్కడి సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్టు చెబుతున్నారు. ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో కొవిడ్‌లో పనిచేసిన వారికి కొంత వెయిటేజీ ఇస్తున్నారు. దీంతో ఆ సర్టిఫికెట్‌కు డిమాండ్ పెరిగింది. దానిని కొందరు క్యాష్ చేసుకుంటున్నారు. ఈ సర్టిఫికెట్లను కొందరు అభ్యర్థులకు కేజీహెచ్‌లోని నర్సింగ్ అసోసియేషన్‌లో కీలకంగా పనిచేసే వ్యక్తి ఇస్తున్నట్టు చెబుతున్నారు. దీనిపై కేజీహెచ్, మెడికల్ కాలేజీ అధికారులు విచారణ చేయాలని, అప్పుడే ఈ తరహా నకిలీ సర్టిఫికెట్లకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుందని కోరుతున్నారు.

రెండు రోజుల్లో మెరిట్ లిస్ట్

రెండు రోజుల్లో ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మొత్తం ప్రక్రియను పూర్తి చేశామని, కొందరు అభ్యర్థుల సర్టిఫికెట్లపై స్పష్టత వచ్చిన వెంటనే జాబితా ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. ఫైనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించి నివృత్తి చేసిన తరువాతే సెలక్షన్ లిస్టు పెడతామని ఆర్డీ రాధారాణి వెల్లడించారు.

రంగంలోకి దళారులు

నియామక ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో కొందరు దళారులు రంగ ప్రవేశం చేశారు. ఇప్పటికే అభ్యర్థుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మెరిట్‌లో ఉన్న అభ్యర్థుల వివరాలను సేకరించి, వారికి ఫోన్లు చేసి డబ్బులు ఇస్తే ఉద్యోగం వచ్చేలా చేస్తామంటూ బేరసారాలు సాగిస్తున్నట్టు చెబుతున్నారు. ఇదే విషయం ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దని, అటువంటి వారిపై ఫిర్యాదులు చేయాలని ఆర్డీ పి.రాధారాణి కోరుతున్నారు. మెరిట్ ప్రాతిపదికనే ఉద్యోగాలు వస్తాయని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.

పూర్ణామార్కెట్ ప్రాంతం ప్రక్షాళన

... 5వ పేజీ తరువాయి

ఆక్రమణలు వెలిశాయి. ఈ విషయం తెలిసి పోలీస్ కమిషనర్ గురువారం రాత్రి ఆ ప్రాంతాన్ని సందర్శించి ఆక్రమణలను తొలగించాల్సిందిగా ఆదేశించారు. అయితే ఆయన ఆదేశాలను సిబ్బంది పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 'పోలీస్ కమిషనర్ ఆదేశాలు బేఖాతరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో పోలీసు కమిషనర్ బాగ్చి స్పందించి...ఆక్రమణలు తొలగించాలని అధికారులను గట్టిగా ఆదేశించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం పెద్దఎత్తున పూర్ణామార్కెట్ ప్రాంతానికి చేరుకుని ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని సైతం వెళ్లగొట్టారు. స్ప్రింగ్ రోడ్డు, ఫ్రూట్ మార్కెట్ రోడ్డు, పూర్ణామార్కెట్ ప్రధాన రహదారులను ఖాళీ చేయించారు. పూర్ణామార్కెట్ ప్రాంతంలో వాహనాలు సాఫీగా వెళ్లేలా చేశారు. పోలీసుల చొరవ కారణంగా పూర్ణామార్కెట్ ప్రక్షాళన జరిగిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వీధుల్లో భారీ వాహనాల పార్కింగ్

- గోదాముల ముందు గంటల తరబడి రవాణా వాహనాలు నిలిపివేత
- రోజూ ఇదే తంతు..
- స్థానికుల రాకపోకలకు తప్పని కష్టాలు



మద్దిలపాలెంలో దారికి అడ్డంగా భారీ లారీ నిలిపి వేసి అన్‌లోడింగ్ చేస్తున్న దృశ్యం

మద్దిలపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పగలు రద్దీ సమయంలో నగరంలోకి సరుకు రవాణా లారీలు, భారీ వాహనాలకు ప్రవేశం లేదు. అయితే ఈ నిబంధనను పక్కాగా అమలు చేయకపోవడంతో లారీలు వేళాపాళా లేకుండా నగరంలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లోనే కాకుండా ఇరుకు రోడ్లున్న గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మద్దిలపాలెం పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. మద్దిలపాలెంలో ఫ్లోరింగ్ టైల్స్, కిరణా జనరల్, వాటర్ బాటిల్స్, బియ్యం గోదాములు ఉన్నాయి. ఆయా గోడౌన్లకు ఉత్పత్తులు తీసుకొచ్చే లారీలను నిత్యం వీధుల్లోని రోడ్లపై గంటల తరబడి నిలిపి వేస్తున్నారు. దీంతో స్థానికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మద్దిలపాలెం ట్రిబుల్ ఎస్ బార్ డౌన్‌లో గురువారం ఉదయం టైల్స్ లోడుతో వచ్చిన భారీ లారీ దారికి అడ్డంగా పార్కింగ్ చేశారు. సాయంత్రం 6 గంటల వరకు టైల్స్ అన్‌లోడ్ చేశారు. మరో పక్క భవన నిర్మాణ సామగ్రి స్టోర్ చేశారు. దీంతో అటుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే రోడ్డులో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్, సాధారణ అపార్టమెంట్లు నివాసాలున్నాయి. వారంతా కార్లలో ప్రయాణాలు చేస్తుంటారు. దారికి అడ్డంగా పార్కింగ్ చేసిన లారీతో ఎటూ వెళ్లలేక నానా అవస్థలు పడ్డారు.

ఇలా రోజూ లారీల పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ కారణంగా కొన్నిసార్లు వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఇరుకు రోడ్లలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

11 నుంచి పోలమాంబ ఉత్సవాలు



మేళతాళాల మధ్య పందిరి రాట వేస్తున్న భక్తులు

ఆరిలోవ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంజయ్ గాంధీ కాలనీలో వెలిసిన గ్రామ దేవత పోలమాంబ అమ్మవారి పంచమరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం వేద పండితులు వేద మంత్రాల మంగళవాయిద్యాల మధ్య పందిరిరాట మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు విచ్చేశారు. ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు కంచుమూర్తి నాగరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి గోవిందరాజు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. అమ్మవారి ప్రధాన పండగ 15న ఉంటుందని, ఆ రోజు సాయంత్రం పరస, రాత్రి 8 గంటలకు మాల ధరించిన భక్తులు అగ్నిగుండం తొక్కే కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

తల్లిదండ్రుల కలలను విద్యార్థులు సాకారం చేయాలి

- ఏయూ ప్రొఫెసర్ హరనాథ్



విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను అందజేస్తున్న హరనాథ్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల కలలను విద్యార్థులు సాకారం చేయాలని ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఎస్.హరనాథ్ పేర్కొన్నారు. వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ తరఫున సుమారు ఐదు వేల రూపాయలు విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలను నిర్వాహకులు శుక్రవారం సోషల్ వర్క్ విభాగానికి అందజేశారు. ఈ సందర్భంగా హరనాథ్ మాట్లాడుతూ సామాజిక ప్రగతిలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ, అంకిత భావంతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలు, ఆశయాలతో ముందడుగు వేయాలన్నారు. ఆత్మవిశ్వాసంతో విజయాలు సాధ్యమవుతాయన్నారు. ఈ సందర్భంగా వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ నిర్వాహకుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ, వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ వైస్ గవర్నర్లు డాక్టర్ పీవీఎస్ఎన్వీ సాంబమూర్తి, కేఎస్ రామారావు, నటరాజ్ క్లబ్ అధ్యక్షుడు గరుడ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 17, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు(నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 22, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 44, పొట్లకాయ 28, చేమదుంపలు 42 చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట)3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

సీతారామ కల్యాణానికి ఏర్పాట్లు



మంగళస్నానం చేయిస్తున్న పురోహితుడు

ఎంవీపీ కాలనీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్నఆంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాములను పెళ్లి ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం ఆలయం ఆవరణలో భక్తులు దంచిన పసుపుతో సీతారాములకు మంగళస్నానం చేయించారు. శ్రీరామ నవమి రోజైన ఆదివారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి ముందస్తుగా ఆలయాన్ని అలంకరిస్తున్నారు.

మత్స్యకారులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మణరావు



బోటును తనిఖీ చేస్తున్న లక్ష్మణరావు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి. లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు వేట చేసే సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద ప్రభుత్వం మొదటి విడతగా మత్స్యకారులకు ట్రాన్స్ పాండర్స్ బోట్లునందు మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లుకు 618 ట్రాన్స్ పాండర్స్ 100 శాతం రాయితీపై సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. ట్రాన్స్‌పాండర్స్ వినియోగం, వాటి పనితనంపై మర పడవల యజమానులు, డ్రైవర్లకు అవగాహన ఉండవలసిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌పాండర్స్ వల్ల సముద్రంలో బోటు ఉన్న స్థానం తెలుసుకోవడానికి, చేపల లభ్యత, బోటు ప్రమాదంలో ఉన్నప్పుడు సమాచారం తెలుసుకోడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షార్ సైంటిస్ట్‌లు సునీల్‌కుమార్, పలాష్ జోషి, ఎన్.ఎస్ఐఎల్ శాస్త్రవేత్త రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే ఆటిజం నియంత్రించవచ్చు

రెయిన్ బో ఆస్పత్రి వైద్యులు



విలేకరులతో మాట్లాడుతున్న రెయిన్ బో ఆస్పత్రి వైద్యులు

ఆరిలోవ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కొందరు చిన్నారులు సాధారణ పిల్లల్లా శారీరక పెరుగుదల కనిపించినప్పటికీ వికాస లోపం ఉంటుందని, ఆ లక్షణాన్నే ఆటిజంగా పేర్కొంటారని రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి వైద్యులుతెలిపారు. ఈ వ్యాధిని త్వరితగతిన గుర్తించి వైద్యం చేసినట్టయితే చిన్నారులను సాధారణ స్థితికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఆటిజం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హెల్త్‌సిటీలోని రెయిన్ బో ఆస్పత్రిలో ఈ వ్యాధి బారిన పడిన చిన్నారులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు మాట్లాడుతూ ప్రతి 68 మంది చిన్నారులలో ఒకరు ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ఇతరులతో సమచారం పంచుకోవడం (కమ్యూనికేషన్ ఇబ్బంది), ఎదుటి వారి కళ్లలో కల్లు పెట్టి చూస్తూ మాట్లాడలేకపోవడం, ఎంత పిలిచినా పలకకపోవడం, వినికిడి లోపం ఉన్నట్టు ప్రవర్తన, ఒకే చోట కుదురుగా ఉండకపోవడం, మితిమీరి పరుగు తీయడం, చేసినపనులే పలుసార్లు చేయడం తదితర లక్షణాలు పిల్లల్లో కనిపిస్తే ఆటిజంగా గుర్తించాలన్నారు. వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. రెయిన్‌బో ఆస్పత్రిలో ఈ వ్యాధిది నిర్ధారణకు తగిన చికిత్స ఉందని చెప్పారు. కార్యక్రమమంలో వివిధ విభాగాల పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ అశ్విని, మోహన్, ప్రసన్న కుమార్, దీపా, మోహన్, శ్రీలక్ష్మి, దివ్యజ్యోతి పాల్గొని అవగాహన కల్పించారు.

నూకాంబిక అమ్మవారి మారువారం



పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో వేంచేసియున్న నూకాంబిక అమ్మావారికి శుక్రవారం మారువారం పండుగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో పురవీధుల్లో ఊరేగించి, అనంతరం అమ్మవారికి నీలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుగత సత్యనారాయణ, కర్రి గౌరీ, నరేంద్ర, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు విజ్ఞాన ప్రాజెక్టులు దోహదం

జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్



బహుమతులు అందుకున్న విద్యార్థులు, పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆరిలోవ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ప్రాజెక్టులు చక్కగా దోహద పడతాయని జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, అకడమిక్ మోనటరింగ్ అధికారి జి.లక్ష్మి పేర్కొన్నారు. తోటగరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను శుక్రవారం ప్రదర్శించారు.ఎంపిక చేసిన 11 పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా జ్యూరీ సభ్యులు ప్రాజెక్టులను సమీక్షించి ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. అకడమిక్ మోనటరింగ్ అధికారి జి.లక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం, అందులో విద్యార్థులను భాగస్వామ్యం చేయ డం అవసరమన్నారు. జిల్లా మేనేజర్ నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వం పెంపొందిచి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడా నికి ఇలాంటి కార్యక్రమాలు చక్కని వేదికలుగా పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ప్రథమ బహుమతి గాజువాక జిల్లా పరిషత్తు హైస్కూలు, ద్వితీయ బహుమతి సరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూలుకు లభించింది.

ఈ బహుమతులను ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ అందించారు, కార్యక్రమంలో తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

'వైవిధ్యాన్ని ఏకం చేసేది ప్రజాస్వామ్యం'

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వైవిధ్యంను ఏకం చేసేది ప్రజాస్వామ్యమని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (న్యూఢిల్లీ) సెంటర్ ఫర్ యూరోపియన్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శీతల్ శర్మ అన్నారు. ఏయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ యూరోపియన్, యూనియన్ సహకారంతో ఇనిస్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంట్ సమన్వయంతో నిర్వహించిన ఒకరోజు అంతర్జాతీయ సదస్సు భారత్-యూరప్ దేశాలలో ప్రజాస్వామ్యం వైవిధ్యత మార్పులను ఆమె ప్రారంభించారు.

గణిత శాస్త్ర విభాగంలో ఫేర్‌వెల్ సందడి



వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న గణిత శాస్త్రం విభాగం ఆచార్యులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏయూ గణిత శాస్త్ర విభాగంలోని సీనియర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ ఫంక్షన్ శుక్రవారం సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ప్రముఖ అంతర్జాతీయ మోటివేషన్స్ స్పీకర్ లక్ష్మీపురం వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఏ రకంగా గోల్స్ ఏర్పాటు చేసుకోవాలో ఉదాహరణలతో వివరించారు. ఎవరి జీవితం తమ చేతుల్లోనే ఉంటుందని, దానిని అందంగా మలుచుకునే శిల్పి ఎవరికి వారే కావాన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీఆర్ రాజు మాట్లాడుతూ జీవితంలో ఉపయోగపడే పాజిటివ్ యాటిట్యూడ్, నిబద్ధత, సమయపాలన తదితర అలవాట్లు ప్రతి ఒక్కరూ కచ్చితంగా అలవరచుకోవాలన్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి అనురాధ కామేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్ పీడీఎస్ శ్రీనివాస్, ప్రొఫెసర్ జి.నానాజీరావు, ప్రొఫెసర్ ఎస్.రవికుమార్, ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎన్.రామకృష్ణ, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సభ అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కేఎస్ కుమార్

ఆరిలోవ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : ప్రజలపై అనేక భారాలను మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో మరో ఆఫుతున్నటువంటి ఆదాని స్మార్ట్ మీటర్లను యావన్మంది ప్రజానీకం వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్కేఎస్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన స్థానిక సుంధరయ్య కాలనీ గ్రామ సంఘం సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 'స్మార్ట్ మీటర్లను మా ఇంటికి అమర్చవద్దు' అని రాసిన స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రణాళిక రూపొందించిందని ఆరోపించారు. ఇందులో భాగంగానే రాష్ట్రాలకు ఉండే హక్కులను కాలరాస్తూ విద్యుత్ నిర్వహను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొనేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ క్రమంలో వినియోగదారులపై అదనపు చార్జీల భారం పడిందన్నారు. తాజాగా ఆదానీ ప్రీ పెయిడ్ స్మార్ట్ మెటీరియల్‌ని తీసుకొని వచ్చి వినియోగదారులపై భారం రుద్దే ప్రయత్నం జరుగుతోందని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం స్థానిక నాయకుడు వి.నరేంద్రకుమార్, కాలనీ నాయకులు అప్పలనాయుడు, రాజు, రమణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేయాలి

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



కళ్యాణమండపం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

ఎంవీపీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నిర్ణీత గడువులోగా కల్యాణమండపం నిర్మాణాన్ని పూర్తి చేయాలని వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ సిబ్బందిని ఆదేశించారు. ఎంవీపీ కాలనీ ఒకటో సెక్టరులోని కల్యాణ మండపం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచనల మేరకు కల్యాణమండపం ఆధునీకీకరణ చేపట్టినట్టు తెలిపారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే ఈ కల్యాణ మండపంలో ఏసీ సదుపాయం ఉన్నట్టు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయనతో పాటు వీఎమ్మార్డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు లోని పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మహా కుంకుమాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని సీతమ్మవారికి కుంకుమతో పూజ చేశారు. ఆలయ ప్రధానార్చకులు రంపా రామ్మోహన్ శర్మ భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘం అధ్యక్షుడు కర్రి వెంకట సూర్యఅప్పారావు, గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, ప్రధాన కార్యదర్శి బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శి కర్రి రవి ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంప్రదాయ దినోత్సవం



మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్, పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతీసంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ సిస్టం ఇంజనీరింగ్ విభాగంలో ఎత్నిక్ డే నిర్వహించారు. శుక్రవారం విభాగంలో విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ వస్త్రధారణలో ఎత్నిక్‌డే వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ హాజరై విద్యార్థులను అభినందించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను అనుసంధానం చేస్తూ ప్రజలందరినీ ఐక్యం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు నిలుస్తాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అభినందించారు. విద్యార్థులకు స్వయంగా వీసీ కవిత చదివి వినిపించారు. అనంతరం విభాగ విద్యార్థులు, పరిశోధకులతో ఆయన ముచ్చటించారు. పరిశోధకులు తాము చేస్తున్న పరిశోధనలను వీసీకి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వీసీ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ చేస్తున్న విధానం, అంశాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.శశిభూషణరావు, విభాగాధిపతి కె.వెంకటరావు, ఆచార్యులు శశి, లావణ్యాదేవి, వల్లికుమారి, విభాగాచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



ర్యాలీలో పాల్గొన్న బుల్లయ్య కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ప్రిన్సిపాల్, ప్రోగ్రాం ఆఫీసర్లు

సీతమ్మధార, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు మాదక ద్రవ్యాల వైపు వెళ్లొద్దు (సే నోటు డ్రగ్) అనే అంశంపై నినాదాలు చేస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ మాదక ద్రవ్యాలు మనిషి జీవితానికి చాలా హానికరమని అవగాహన కల్పిస్తూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.సతీష్‌నాయుడు, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య పీడితుడికి సీఎం ఆర్థికసాయం


బాధితునికి చెక్కు అందిస్తున్న టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు వరప్రసాద్

మురళీనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు, మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న స్థానిక 50వ వార్డు నివాసి బెహరా రాజుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.81,101 మంజూరైంది. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన చెక్కును టీడీపీ వార్డు అధ్యక్షుడు వరప్రసాద్ శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రాజు అకస్మాత్తుగా గత నెల అనారోగ్య ఇబ్బందులకు గురై చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్థోమత లేక ఈ కుటుంబం ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్‌లకు విన్నవించగా వీరి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. బెహరా రాజు, ఆయన కుటుంబికులకు ధైర్యం చెబుతూ సీఎం చంద్రబాబు పేరుతో ఓ లేఖ కూడా పంపారు. వార్డు నాయకులు బాధితుని కుటుంబానికి అండగా ఉండాలని లేఖలో సూచించారు.

భగవద్గీత పఠనంలో జ్యోతికి గోల్డ్ మెడల్

మురళీనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మైసూర్‌లో అవధూత పీఠం నిర్వహించిన భగవద్గీత ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో మాధవధారకు చెందిన సి.హెచ్.జ్యోతి గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని సాధించారు. దత్త ఆశ్రమంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ నుంచి జ్యోతి ప్రశంసాపత్రం అందుకున్నారు. పవిత్ర గ్రంథంలోని 18 అధ్యాయాల్లోని 701 శ్లోకాల్ని పఠించే అవకాశం రావడం అదృష్టంగా సి.హెచ్. జ్యోతి పేర్కొన్నారు.


మెడల్‌తో జ్యోతి

శ్రీచైతన్య అకాడమీలో నీట్ కోర్సు 'ఆత్రేయ' ప్రారంభం

మహారాణిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రత్యేక నీట్ కోర్సు 'ఆత్రేయ'ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర బోధనా విధానం ద్వారా రూపొందించిన 'ఆత్రేయ' 11వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ఫిజిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి పీ2సీబీజెడ్ ద్వారా సెషన్లు రెట్టింపు చేస్తుందన్నారు. విద్యార్థులలో విషయ అవగాహన (కాన్సెప్ట్) పెంచడం ద్వారా నీట్‌లో ఉత్తమ ర్యాంకుల సాధనకు అవసరమైన శక్తిని అందిస్తుందని తెలిపారు. బోధనలో కృత్రిమ మేధ (ఏఐ) విధానాన్ని మిళితం చేయడం ద్వారా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించగలిగే అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల బలాన్ని గుర్తించి వారు మరింత ప్రతిభ కనబరిచేలా వ్యక్తిగత అధ్యయన ప్రణాళిక, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంచే ప్రయత్నం చేస్తున్నట్లు సుష్మ పేర్కొన్నారు.

7 నుంచి 'ఎన్‌టీఆర్ వైద్య సేవ'లు బంద్

... 5వ పేజీ తరువాయి

అందించలేమని ఆస్పత్రులు యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అందువల్ల రోగులు తమను అర్థం చేసుకుని సహకరించాలని 'ఆషా' ఒక లేఖను విడుదల చేసింది. దీనిపై ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావును వివరణ కోరగా..ఉన్నత స్థాయి నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు. ప్రస్తుతానికి నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో యథావిధిగా వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు.

పర్యావరణానికి తూట్లు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ఎదురుగా నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లను పార్కులుగా రూపుదిద్దేందుకు అధికారులు సంకల్పించారు. దీనిలో భాగంగా గ్రీన్‌బెల్ట్‌లోని చెట్లను నరికేయడంతో స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అధికారులు కృషి చేయాలే గానీ, దాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పార్కుల్లో మొక్కలు వేయాల్సిన అధికారులు ఉన్న చెట్లను నరికి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారని పలువురు పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. ఇలా చెట్లను నరికి కాంక్రీట్ జంగిల్‌గా మార్చడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని గ్రీన్‌బెల్ట్‌లను కొన్ని పార్కులుగా మార్పు చేశారు. మరికొన్నింటిలో ఏంచేస్తారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. చెట్లను నరకడంతో పాటు ఎత్తైన ప్రహరీని ఎందుకు నిర్మిస్తున్నారో తెలియడం లేదని చెబుతున్నారు.


పార్కులో చెట్లను నరుకుతున్న కార్మికులు


నిర్మించిన ఎత్తైన ప్రహరీ

హుద్‌హుద్ తుఫాన్ కారణంగా నగరంలో చెట్లన్నీ నాశనమవ్వడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం మొక్కలు వేసి మళ్లీ పూర్వస్థితికి తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. ఆ మొక్కలు ప్రస్తుతం చెట్లుగా ఎదిగి స్వచ్ఛమైన గాలి ఇస్తున్నాయని అంటున్నారు. కానీ ఆ చెట్లను ఎందుకు నరుకుతున్నారో తెలియడం లేదని స్థానికులు అసంతృప్తి చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెట్లను నరకకుండా ఆదేశాలివ్వాలని స్థానికులు కోరుతున్నారు.

'సింథటిక్ ట్రాక్‌పై సాధనకు అనుమతించండి'

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు నేవల్ కమాండ్, కమాండ్ స్పోర్ట్సు ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ ఫజుల్ మహ్మద్‌ను జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు కలిసి అథ్లెట్స్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. జాతీయ స్థాయి మీట్‌లలో పతకాలు సాధించిన కొందరు అథ్లెట్లకు ఇక్కడ సింథటిక్ అందుబాటులో లేకపోవడంతో అంతర్జాతీయ స్థాయికి చేరుకోలేకపోతున్నారని, అలాంటివారికి ఐఎన్ఎస్ శాతవాహన మైదానంలో సాధన చేసుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమాండ్ స్పోర్ట్సు ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ ఫజుల్ మహ్మద్ స్పందిస్తూ ప్రతిభ గల అథ్లెట్లకు సింథటిక్ ట్రాక్‌లో సాధన చేసుకునేందుకు అనుమతి ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని నారాయణరావు తెలిపారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అథ్లెటిక్స్ కోచ్ కె.వైకుంఠరావు పాల్గొన్నారు.


లెఫ్టినెంట్ కమాండర్ ఫజుల్ మహ్మద్‌తో నారాయణరావు, వైకుంఠ

సెమీస్‌కు టీ20 క్రికెట్ నాకౌట్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న చిన్నరాజు, రామరాజు స్మారక టీ 20 క్రికెట్ నాకౌట్ టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లలో శారద సిసి, స్టాలియన్స్ సిసి, పెంటమాంబ సిసి, ఉషోదయ సిసి గెలుపొందాయి. స్టీల్‌ప్లాంట్ త్రిష్నా గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో స్టాలియన్స్ సిసి 44 పరుగుల తేడాతో రైజింగ్ బ్లూస్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన స్టాలియన్స్ సిసి నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 159 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో రైజింగ్ బ్లూస్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 115 పరుగులకు పరిమితమై ఓటమి పాలైంది. ఉషోదయ సిసి 20 పరుగుల తేడాతో గుడ్ ఫ్రెండ్స్‌పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఉషోదయ సిసి నిర్ణీత 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ కాగా, లక్ష్య ఛేదనలో గుడ్ ఫ్రెండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 126 పరుగులు చేసి ఆలౌటై ఓటమి పాలైంది. హిందుస్థాన్ జింక్ గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో శారద సిసి రెండు వికెట్ల తేడాతో సిటీ సిసిపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ సిసి నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 138 పరుగుల స్కోరు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన శారద సిసి 19.3 ఓవర్లలో ఎనిమిది వికెట్లు నష్టపోయి 141 పరుగులు చేసి అనూహ్య విజయం సాధించింది.

రాములోరి కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు

కంచరపాలెం/సీతమ్మధార, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం రాములోరి కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. కంచరపాలెం, సీతమ్మధార పరిసర ప్రాంతాల్లోని రామాలయాలను సుందరంగా అలంకరిస్తున్నారు. రెడ్డికంచరపాలెం, గొల్లకంచరపాలెం, ఆర్పీపేట, తుమ్మడిపాలెం, కప్పరాడ, నక్కవానిపాలెంలో సీతారాముల కల్యాణఘట్టాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా పందిళ్లు వేస్తున్నారు. శుక్రవారం ఉడుపురాట కార్యక్రమాన్ని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. కల్యాణ వేడుకల్లో పాల్గొనాలని ప్రచారం చేస్తున్నారు.


నక్కవానిపాలెంలో సీతారామలక్ష్మణులు


రెడ్డికంచరపాలెం రామాలయం వద్ద ఉడుపురాట ఉత్సవంలో స్థానికులు


నక్కవానిపాలెంలో రాములోరి పెళ్లిరాట వేస్తున్న భక్తులు

ఇబ్బంది ఎదురైతే నాకు ఫోన్ చేయండి: సీపీ బాగ్చి

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులపట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని, ఏ సమయంలో.. ఏ అవసరమొచ్చినా వాట్సాప్ ద్వారా తనకు తెలియజేయాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి విద్యార్థినులకు సూచిస్తూ తన వ్యక్తిగత మొబైల్ నెంబరును తెలియజేశారు. ఆత్మస్థైర్యంతో ముందుకు వెళితే అత్యున్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ ప్రేమసమాజంలో నిర్వహించిన పైడా మహిళా డిగ్రీ కళాశాల 27వ వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినులకు భరోసా ఇచ్చారు. మానసికంగా దృఢంగా ఉంటే దేన్నయినా సాధించవచ్చన్నారు. పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదిగితే ఆ కుటుంబాలు ఆర్థికంగా బలంగా ఉంటాయన్నారు. రాజ్‌మతాజ్ సీఈవో డాక్టర్ మీనాక్షి అనంతరామ్ మాట్లాడుతూ జీవితం నుంచే పాఠాలు నేర్చుకుని ముందుకు నడవాలన్నారు. డాక్టర్ శ్రీవల్లికోరాపట్టి, మేక క్రాంతిసుధా తమ ప్రసంగాల్లో విద్యార్థినులను అప్రమత్తం చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన శ్రీకృష్ణలీలలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సరోజ మాట్లాడారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, పైడా విద్యాసంస్థల అధినేత కృష్ణప్రసాద్ తదితరులు

కోడింగ్ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు


తమ పాఠశాల విద్యార్థులు, టీచర్ గెలిచిన ఎలక్ట్రానిక్ వస్తువులతో ప్రధానోపాధ్యాయిని హేమలత, ఉపాధ్యాయులు

మాధవధార, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్, సమగ్ర శిక్ష సంయుక్తంగా నిర్వహించిన 'సీఎస్ హాకథాన్-2025' కంప్యూటర్ కోడింగ్ పరీక్షలో మాధవధార జీవీఎంసీ ఉపాధ్యాయులు, విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాలకు ఒక స్మార్ట్ టెలివిజన్, రెండుల్యాప్ టాప్‌లు, 2 ట్యాబ్‌లు, 1 గూగుల్ అలెక్సా పరికరం బహుమతులుగా వచ్చాయి. మాధవధార స్కూలు నుంచి 8వ తరగతి విద్యార్థులు సంధ్య, విద్య, చైతన్య, స్కూలు మాస్టర్ వి.జానకిరామ్ కూడా కంప్యూటర్ కోడింగ్ టెస్ట్‌లో ప్రతిభ చూపారు. 'హిడెన్ స్కార్స్' అనే టైటిల్‌తో ఇంట్లో ఎవరైనా మద్యానికి బానిస అయితే, ఆ ఇంట్లో పిల్లల చదువు.. వారి భవిష్యత్‌పై ఈ దురలవాట్ల ప్రభావంతో పాటు ప్రభుత్వం, పాఠశాల గురించి ఒక యానిమేటెడ్ స్టోరీ తయారుచేసి మాధవధార విద్యార్థులు పోటీ నిర్వాహకుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా వారు గెలుచుకున్న ఎలక్ట్రానిక్ వస్తువుల్ని పాఠశాలలో నిర్వాహకులు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని బి.హేమలత విజేతల్ని అభినందించారు.

'సూర్యారాధన దేవాలయాలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఇతర ప్రముఖులు

సీతంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం విశాఖ సాహితి 54వ వ్యవస్థాపక దినోత్సవం, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త ఆచార్య కోలవెన్ను పాండురంగ విఠల్‌మూర్తి రచించిన 'సూర్యారాధన దేవాలయాలు' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ సాహితి అధ్యక్షుడు ఆచార్య కోలవెన్ను మలయవాసిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ కులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడిపై ఆచార్య కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి పరిశోధన చేసి ఒక మంచి పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వై.వి.అనురాధ, విశ్రాంత పోలీసు అధికారి శ్రీరంగం దివాకర్, మండికోట విశ్వనాథం, శంకర్‌నీలు, భాగవతులు, డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టండి

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు పిలుపు

అల్లిపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించిన అనంతరం పైడిరాజు మాట్లాడుతూ మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరుగుతూ సామాన్యుల బతుకు భారమైందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా చంద్రబాబు హామీలేవీ అమలు కావడం లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఎప్పటికి కార్యరూపం దాల్చుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. ఊరూరా మద్యం ఏరులై పారుతోందని అన్నారు. సీఎం హోదాలో చంద్రబాబు తొలి సంతకం చేసిన డీఎస్సీ పోస్టుల భర్తీ అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభులు విమల, సత్యనారాయణ, రహమాన్, చంద్రశేఖర్, మన్మథరావు, శ్రీనివాసరావు, సీఎన్ క్షేత్రపాల్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నేటి నుంచి వాల్తేరు రైల్వే అంతర్గత క్రీడలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం బొహ్రా, ఇతర అధికారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్, వాల్తేరు శాఖ నిర్వహించనున్న అంతర్గత క్రీడా పోటీలు శనివారం నుంచి జరగనున్నాయి. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 30 వరకు జరిగే స్పోర్ట్సు మేళాలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, బాడీ బిల్డింగ్, చెస్, క్రికెట్, క్యారమ్, ఫుట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. కమర్షియల్, ఆపరేటింగ్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, క్యారేజ్ అండ్ వ్యాగన్స్, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికాం, పర్సనల్, ఆర్పీఎఫ్ శాఖల నుంచి వాల్తేరు డివిజన్ పరిధిలోని అరకు, కొరాపుట్, దమన్‌జోడి, కిరండూల్, బచేలి, రాయగడ, పలాస, శ్రీకాకుళం తదితర ప్రాంతాల ఉద్యోగులు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ప్రవీణ్ భాటి, అవినాష్, నరేంద్ర కురి, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ ప్రాంతం ప్రక్షాళన

... 5వ పేజీ తరువాయి

ఆక్రమణలు వెలిశాయి. ఈ విషయం తెలిసి పోలీస్ కమిషనర్ గురువారం రాత్రి ఆ ప్రాంతాన్ని సందర్శించి ఆక్రమణలను తొలగించాల్సిందిగా ఆదేశించారు. అయితే ఆయన ఆదేశాలను సిబ్బంది పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 'పోలీస్ కమిషనర్ ఆదేశాలు బేఖాతరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో పోలీసు కమిషనర్ బాగ్చి స్పందించి...ఆక్రమణలు తొలగించాలని అధికారులను గట్టిగా ఆదేశించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం పెద్దఎత్తున పూర్ణామార్కెట్ ప్రాంతానికి చేరుకుని ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని సైతం వెళ్లగొట్టారు. స్ప్రింగ్ రోడ్డు, ఫ్రూట్ మార్కెట్ రోడ్డు, పూర్ణామార్కెట్ ప్రధాన రహదారులను ఖాళీ చేయించారు. పూర్ణామార్కెట్ ప్రాంతంలో వాహనాలు సాఫీగా వెళ్లేలా చేశారు. పోలీసుల చొరవ కారణంగా పూర్ణామార్కెట్ ప్రక్షాళన జరిగిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి దొంగలు

... 5వ పేజీ తరువాయి

ఫిర్యాదు చేసినా పెందుర్తి తహసీల్దారు పట్టించుకోలేదు. అయితే స్పందించిన గృహ నిర్మాణ సంస్థ అధికారులు మాత్రం 20 మందిని అనర్హులుగా గుర్తించి, కేటాయించిన ఇళ్లను రద్దు చేశారు. మిగిలిన 114 ఇళ్లకు పలు దఫాలుగా నిధులు మంజూరుచేశారు. గృహ నిర్మాణ సంస్థ కేటాయింపులతో సంబంధం లేకుండా లేఅవుట్‌లో 178 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. కొన్ని ఇళ్లు పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. గ్రామంలో ఎక్కువ మంది అనర్హులకు ఇళ్లు మంజూరుచేయగా, కేవలం 20 మందినే జాబితా నుంచి తప్పించి, మిగిలిన వారికి అనుమతి ఇచ్చిన వ్యవహారం వెనుక గృహనిర్మాణ సంస్థ అధికారుల పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల 'పెద్దలకు పేదోళ్ల ఇళ్లు' శీర్షికన 'ఆంధజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా యంత్రాంగం, గృహ నిర్మాణ సంస్థలు స్పందించాయి. దీనిపై రెవెన్యూశాఖ అధికారులు విచారణ చేపట్టగా 79 మంది అనర్హులున్నట్టు తేలింది. మూడు రోజుల క్రితం జిల్లా హౌసింగ్ పీడీ సత్తిబాబు కాలనీని సందర్శించారు. దీంతో వారికి కేటాయించిన ఇళ్లను రద్దు చేయాలని నిర్ణయించారు. అనర్హులకు పట్టాలు మంజూరుచేసిన అప్పటి పెందుర్తి తహసీల్దారు, ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం భావిస్తున్నట్టు సమాచారం.

కార్పొరేటర్ల కలెక్షన్!

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యే ద్వారా పోస్టులన్నీ ఆప్కోస్‌లో చేరేలా చేస్తానంటూ భరోసా ఇచ్చినట్టు తెలిసింది. పోస్టులన్నీ అమ్ముకున్న కార్పొరేటర్లు...వారిని విధుల్లోకి తీసుకోవాలంటూ జోనల్ కమిషనర్, ప్రధాన వైద్యాధికారిపై ఒత్తిడి తేవడం ప్రారంభించారు. దీనికి ఇన్‌చార్జి కమిషనర్ అనుమతి అవసరం కాబట్టి, ఫైల్‌ను ఆయనకు పంపించామంటూ ఇంతవరకూ అధికారులు తాత్సారం చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ నుంచి ఆమోదం రావడంతో ఈనెల రెండో తేదీ నుంచి 22 మంది తాత్కాలిక సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నారు. తాత్కాలిక పారిశుధ్య కార్మికుల పోస్టులు విక్రయించుకున్నారనే ఆరోపణలను జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా తాము నిబంధనల ప్రకారమే వారందరినీ విధుల్లోకి తీసుకున్నామని, డబ్బులు వసూలు చేశారనే విషయం తమకు తెలియదని బదులివ్వడం విశేషం.

100 ఎకరాలకు స్కెచ్

... 5వ పేజీ తరువాయి

భూములను నాన్ 4-సీగా పిలుస్తారు. అంటే హక్కులు లేకున్నా భూములు సదరు రైతుల ఆధీనంలో ఉన్నట్టు. మొత్తం మూడు కేటగిరీలుగా ఉన్న భూములను అధికారికంగా క్రయవిక్రయాలు చేపట్టేందుకు అవకాశం లేదు.

రంగంలోకి గ్యాంగ్

జాతీయ రహదారికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ భూములపై పెద్దల కన్ను పడింది. ఒకేచోట 100 ఎకరాలు ఉండడంతో కొందరు ముఠాగా ఏర్పడి కొద్దిరోజులుగా రైతులతో మంతనాలు సాగిస్తున్నారు. డీపట్టాలు ఇప్పిస్తామని, తమకే విక్రయించాలని స్థానిక అధికార పార్టీ నేతల ద్వారా ఒత్తిడి తెస్తున్నారు. అంతేకాదు ఎకరాకు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఇస్తామని బేరాలు సాగిస్తున్నారు. ఈ భూములు మొత్తం కొనుగోలు చేసిన తరువాత అధికార పార్టీలో కీలక నేతల ద్వారా పైరవీ చేసుకుని క్రమబద్ధీకరణ చేయించుకోవచ్చునని భావిస్తున్నారు. ఇటీవల ఈ ముఠా గ్రామానికి తరచూ వెళ్లి రైతులతో చర్చలు జరుపుతోంది.

4-సీ క్రమబద్ధీకరణ ఎలా?

గతంలో డీపట్టా భూములను వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేయడం పెద్ద వివాదమైంది. దీనిపై చేపట్టిన విచారణ కొలిక్కిరాలేదు. ఈ సమయంలో డీపట్టా లేకుండా కేవలం ప్రభుత్వ రికార్డులలో ఆక్రమణదారులుగా గుర్తించిన (4-సీ) భూములను క్రమబద్ధీకరణ చేయడం సాధ్యమేనా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. కారుచౌకగా భూములు చేజిక్కించుకుని తరువాత వీఎంఆర్‌డీఏ లేదా ప్రభుత్వ అవసరాలకు ఇస్తే భారీగా లబ్ధి పొందవచ్చుననే ఉద్దేశంతో నగరానికి చెందిన గ్యాంగ్ ఈ భూములపై కన్నేసిందనే వాదన వినిపిస్తోంది.

నర్స్ పోస్టులకు ఫేక్ సర్టిఫికెట్లు!

... 5వ పేజీ తరువాయి

పంపించి పునఃపరిశీలన చేయించారు. ఇప్పటివరకూ 14 మంది జత చేసినవి ఫేక్ కొవిడ్ సర్టిఫికెట్లుగా అధికారులు నిర్ధారించారు. మరికొన్ని నిర్ధారణ కావాల్సి ఉందని చెబుతున్నారు. కాగా, ఇప్పటికే గుర్తించిన 14 ఫేక్ సర్టిఫికెట్లు కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీ, శ్రీకాకుళంలోని జనరల్ ఆస్పత్రి నుంచి తెచ్చినట్టుగా అధికారులు నిర్ధారించారు. ఈ సర్టిఫికెట్లు అందించేందుకు అక్కడి సిబ్బంది డబ్బులు వసూలు చేసినట్టు చెబుతున్నారు. ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో కొవిడ్‌లో పనిచేసిన వారికి కొంత వెయిటేజీ ఇస్తున్నారు. దీంతో ఆ సర్టిఫికెట్‌కు డిమాండ్ పెరిగింది. దానిని కొందరు క్యాష్ చేసుకుంటున్నారు. ఈ సర్టిఫికెట్‌లను కొందరు అభ్యర్థులకు కేజీహెచ్‌లోని నర్సింగ్ అసోసియేషన్‌లో కీలకంగా పనిచేసే వ్యక్తి ఇస్తున్నట్టు చెబుతున్నారు. దీనిపై కేజీహెచ్, మెడికల్ కాలేజీ అధికారులు విచారణ చేయాలని, అప్పుడే ఈ తరహా నకిలీ సర్టిఫికెట్లకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుందని కోరుతున్నారు.

రెండు రోజుల్లో మెరిట్ లిస్ట్

రెండు రోజుల్లో ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మొత్తం ప్రక్రియను పూర్తి చేశామని, కొందరు అభ్యర్థుల సర్టిఫికెట్లపై స్పష్టత వచ్చిన వెంటనే జాబితా ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. ఫైనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించి నివృత్తి చేసిన తరువాతే సెలక్షన్ లిస్టు పెడతామని ఆర్డీ రాధారాణి వెల్లడించారు.

రంగంలోకి దళారులు

నియామక ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో కొందరు దళారులు రంగప్రవేశం చేశారు. ఇప్పటికే అభ్యర్థుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మెరిట్‌లో ఉన్న అభ్యర్థుల వివరాలను సేకరించి, వారికి ఫోన్లు చేసి డబ్బులు ఇస్తే ఉద్యోగం వచ్చేలా చేస్తామంటూ బేరసారాలు సాగిస్తున్నట్టు చెబుతున్నారు. ఇదే విషయం ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దని, అటువంటి వారిపై ఫిర్యాదులు చేయాలని ఆర్డీ పి.రాధారాణి కోరుతున్నారు. మెరిట్ ప్రాతిపదికనే ఉద్యోగాలు వస్తాయని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.

ఆటోనగర్‌లో నీటి ఎద్దడి

- 103 కొళాయిల కోసం జీవీఎంసీకి రూ.14 లక్షలు చెల్లించిన పారిశ్రామికవేత్తలు
- ఇప్పటివరకూ వేసినవి 53...
- తక్కువగా నీరు వస్తున్నవి 20
- మిగిలిన 50 కొళాయిల ఊసే లేదాయె..
- అధికారుల తీరుపై పారిశ్రామికవేత్తల అసంతృప్తి




ఆటోనగర్ బి బ్లాకులో నీరు రాక అలంకారప్రాయంగా మిగిలిన కొళాయిలు

ఆటోనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్ బీ బ్లాకులో తాగునీటి వెతలు అధికమయ్యాయి. బీ బ్లాకు పరిశ్రమలకు 103 తాగునీటి కొళాయిల కనెక్షన్లు కోసం పారిశ్రామికవేత్తలు గతంలో జీవీఎంసీ నీటి విభాగ అధికారులకు సుమారు రూ.14 లక్షలు వెచ్చించారు. అయితే తాగునీటి సరఫరా విభాగం అధికారులు 53 కొళాయిలకు మాత్రమే కనెక్షన్లు ఇచ్చారు. అందులో 20 కొళాయిలకు మాత్రమే తూతూమంత్రంగా తాగునీరు వస్తోంది. మిగతా 33 కొళాయిల్లో తాగునీరు రాకపోవటంతో పరిశ్రమల యాజమాన్యాలు అవాక్కవుతున్నారు. కాగా, 103లో మరో 50 కనెక్షన్లు నేటి వరకూ అధికారులు వేయకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆ మిగిలిన కొళాయిలను ఎప్పుడు వేస్తారని అధికారులకు పలుమార్లు అడిగినా స్పందన రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే 50 నూతన కనెక్షన్లు వేయాలని, 103 తాగునీటి పైపుల్లో నీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు.

త్రిశక్తి ఆలయంలో అమ్మవార్లకు విశేష పూజలు



శ్రీమహా దుర్గమ్మకు కమల పుష్పార్చన

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి ఆలయంలో సప్తమి శుక్రవారం వసంత నవరాత్రుల పూజలు విశేషంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీమహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. మహాదుర్గా అమ్మవారిని కమల పుష్పార్చన (తామరపూలు) చేశారు. అనంతరం ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో విశేష పూజలు చేపట్టారు.

ఘనంగా ఉడుపు రాట



పెదమడకలో ఉడుపురాట వేస్తున్న భక్తులు

అగనంపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక రామాలయం వద్దశ్రీరామనవమి ఉత్సవాల కోసం ఉడుపు రాట ఉత్సవాన్ని శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 6న సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కణితి రామాలయంలో..

ఆటోనగర్ : జీవీఎంసీ 87వ వార్డు కణితి రామాలయంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా.. శుక్రవారం శ్రీసీతారాముల కల్యాణం కోసం నిర్వహించే పెండ్లి రాట మహోత్సవం చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ చేసిన అనంతరం ముత్తైదువలు, పుణ్య దంపతుల సమక్షంలో పండితులు వేద మంత్రాలు చదువుతూ పుణ్యాహవచనంతో పెండ్లి రాట ఉత్సవాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, ప్రగడ శ్రీను, దుగ్గపు దానప్పలు, శంకరరావు,బొడ్డ సన్యాసిరావు, వెంకటనారాయణ, ఎం.దా మోదర్, జి.సన్యాసినాయుడు, విజయలక్ష్మి, సత్తిబాబు,రాము తదితరులు పాల్గొన్నారు.



కణితి రామాలయం వద్ద పెండ్లి రాటలో పాల్గొన్న భక్తులు

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్ :** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22,టమాటా 17, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 22, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42 చిలగడ దుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64,

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	108
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

పెంటమాంబ ఉత్సవాలకు బందోబస్తు కల్పించండి

న్యూపోర్టు సీఐ కామేశ్వరరావుకు నిర్వాహకుల వినతి



సీఐతో మాట్లాడుతున్న ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14న పెదగంట్యాడ నిర్వాసిత కాలనీలో నిర్వహించే శ్రీపెంటమాంబ అమ్మవారి అనుపు ఉత్సవానికి తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఉత్సవ నిర్వాహణ కమిటీ సభ్యులు న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావును కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు పులి వెంకటరమణారెడ్డి, యెల్లేటి శ్రీనివాసరావు, గొందేశి అప్పలరెడ్డి, గొందేశి సత్యారావు తదితరులు శుక్రవారం సీఐకి ఇందుకు సంబంధించి వినతపత్రం అందజేశారు.

శ్రీపెంటమాంబ అనుపు ఉత్సవాల సందర్భంగా పరస, సాంఘిక నాటకాలు, సంగీత విభావరి, బళ్ల వేషాలు, గరిడీలు తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, వీటిని తిలకించేందుకు భారీ ఎత్తున ప్రజలు హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, పోలీస్ ఆంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలని భక్తులను కోరారు. సీఐని కలిసిన వారిలో ఉత్సవ నిర్వాహణ కమిటీ సభ్యులు మొల్లి వెంకటరమణ, పిట్ట కుంచారావు, తదితరులు పాల్గొన్నారు.

సగరుల సమస్యలపై బీసీ సంక్షేమ శాఖ మంత్రికి వినతి



మంత్రి సవితమ్మకు వినతి పత్రం అందజేస్తున్న సగరుల సంఘం ప్రతినిధులు

అగనంపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : సగర సామాజిక వర్గం సమస్యలపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను టీడీపీ రాష్ట్ర బీసీ సెల ఉపాధ్యక్షుడు గుర్రం నూకరాజు ఆధ్వర్యంలో సగర సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సగరులు తమ సమస్యలను మంత్రికి వివరించారు. ముఖ్యంగా సగరులకు వృత్తి నైపుణ్యం గుర్తించి బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ డీ నుంచి బీసీ ఏ కేటగిరీలోకి మార్చాలని కోరారు. 'ఉప్పర్లు' అనే పదాన్ని నిషేధించి సగర కులం అని కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు సంఘం ప్రతినిధులు తెలిపారు.



సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఇంటక్ నాయకులు

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు 'ఇంటక్' మద్దతు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు నిరసనగా చేపడుతున్న కార్మిక నిరవధిక సమ్మెకు ఇంటక్ యూనియన్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని యూనియన్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ తెలిపారు. కాంట్రాక్టు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కురందాసు వంశీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో ఏ ఒక్క కార్మికుడిని తొలగించరాదని, ఇప్పటికే తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెడకల్ టెస్టల పేరుతో ఇబ్బందులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పీవీ రమణమూర్తి, జి.ప్రభాకర్‌రెడ్డి, వెంకన్న, భైరెడ్డి అప్పారావు, నూకరాజు, అప్పారావు పాల్గొన్నారు.

పీఎఫ్ అధికారులకు సత్కారం



రీజినల్ పీఎఫ్ అధికారులను సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలోని రీజనల్ పీఎఫ్ అధికారులను స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం (సీ) ప్రతినిధులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పూర్తి వేతనం మీద అధిక పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి సమస్యను పరిష్కరించడంలో తీసుకున్న చర్యలు అభినందనీయమని సీ ప్రతినిధులు పేర్కొన్నారు. పీఎఫ్ కమిషనర్-1 విజయకుమార్ ప్రసాద్, పీఎఫ్ కమిషనర్-2 పవన్‌కుమార్ జాన్టిలు బదిలీ వెళ్తుండడంతో వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ.ప్రసాద్, టి.శ్రీనివాసరావు, విశ్రాంత అధికారులు శ్రీనివాస్, స్వామి, వెంకటరావు పాల్గొన్నారు.

చట్టాలకు లోబడే పోలీసులు వ్యవహరిస్తారు : ఏసీపీ త్రినాథ్



గాజువాక, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల విషయంలో చట్టాలకు అనుగుణంగానే కేసులు నమోదు చేయ డం జరుగుతుందని, నిబంధనలను అతిక్రమించే పరిస్థితి ఉండదని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ పేర్కొన్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జక్కుల రోజా, జక్కుల శాంతకుమారి కుటుంబాల మధ్య కుటుంబ గొడవలు ఉన్నాయన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పాతగాజువాక జంక్షన్‌లో జనవరి 18న రోజా, ఆమె కుటుంబ సభ్యులపై.. శాంతకుమారి, మరికొందరు దాడి చేసినట్టు రోజా గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అలాగే శాంతికుమారి కూడా తమపై కొందరు దాడి చేశారని ఫిర్యాదు చేశారన్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాలపై కౌంటర్ కేసు నమోదు చేసి విచారణ జరిపామని ఏసీపీ తెలిపారు. శాంతికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రోజా కేసును విచారణ జరపగా. రోజాపై ఎటువంటి నేర నిరూపణ జరగకపోవడంతో వారిపై పెట్టిన కేసును తప్పుడు కేసుగా రిఫర్ చేసినట్టు చెప్పారు. అలాగే రోజా ఇచ్చినఫిర్యాదుపై విచారణ జరిపిన పోలీసులు కోర్టులో ఛార్జ్‌మెమో దాఖలు చేశారన్నారు. కాగా, రోజా ఫిర్యాదులో పేర్కొన్న ముద్దాయిలందరినీ అరెస్టు చేయాలని కోరడంతో, రోజా ఇచ్చిన వీడియోను పరిశీలించామని, ఆమె పేర్కొన్న ఇద్దరు వీడియోలో లేకపోవడంతో ఆ ఇద్దరినీ కేసు నుంచి తొలగించి మిగిలిన వారిపై ఛార్జీషీటు ఫైల్ చేసినట్టు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ పార్థసారధి, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

భెల్‌లో హయ్యర్ పెన్షన్ అమలు చేయాలి : కార్మికుల వినతి



ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నేతలు

అక్కిరెడ్డిపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉన్న 17 భెల్ యూనిట్‌లలో అమలు చేస్తున్న హయ్యర్ పెన్షన్ విధానాన్ని భెల్ హెచ్‌పీవీపీలో కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకునేలా కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘ నేతలు కోరారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలసిన ఈ నేతు పలు సమస్యలను వివరించిన వినతిపత్రం అందచేశారు. కర్మాగారంలో 1991లో చేరిన ఆర్ సిరీస్ కార్మికుల రెగ్యులర్ సమయంలో జాయినింగ్ తేదీల నమోదులో జరిగిన పొరపాట్లు వల్ల పలువురుకార్మికుల పీఎఫ్, పెన్షన్ వంటి సౌకర్యాల విషయంలో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు.ఈ సమస్యపై భెల్ యాజమాన్యం పీఎఫ్ అధికారులకు పూర్తి వివరాలు అందజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు.ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని పల్లా హామీ ఇచ్చినట్టు కార్మిక నేతలులు తెలిపారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో కార్మిక సంఘం నాయకులు శుభాకర్ సాహు, కొల్లి దేముడు, బొండా బాబురావు, బి.రవీంద్రబాబు, ఎ.వేంకటేశ్వరరావు, టీఎల్ నర్సింగరావు ఉన్నారు.

చెట్ల నరికివేతపై విమర్శలు

మల్కాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ నిర్వహణ పనుల పేరుతో శ్రీహరిపురం నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు ప్రధాన రహదారిలో ఉన్న చెట్లను ఆ శాఖ సిబ్బంది శుక్రవారం నరికివేశారు.శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టు ఆకులు వైర్లకు అడ్డంగా ఉన్నాయని వాటిని తొలగించడమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను కూడా నరికివేశారు. జీవీఎంసీ సిబ్బంది పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ చెట్లను పెంచారు. వేసవిలో ఇవి ఎంతోమందికి నీడను ఇచ్చేవి. విద్యుత్ శాఖ సిబ్బంది వైర్లకు అడ్డుగా ఉన్న కొమ్మలతో పాటు ఇతర కొమ్మలను, చెట్లను కూడా తొలగించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన

పెందుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ వీరానగర్‌లో పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ సేనాపతి వసంత శుక్రవారం శంకుస్థాపన చేశారు, ఈ కార్యక్రమంలో సేనాపతి శంకరరావు, కిశోర్, చక్రి, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల పెళ్లి రాట

పెందుర్తి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతల అగ్రహారం, లక్ష్మీపురం, చినముషిడివాడ గ్రామాల్లో ఈనెల 6న జరగనున్న సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెళ్లి రాట వేశారు. చింతల అగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దాడి గోపీ అప్పలనాయుడు, మాజీ సర్పంచులు పి. వెంకటరావు, పి. అప్పారావు, రైలు విహార్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పి.గోవిందరావు,కేవీఆర్ ప్రసాదరావు, శ్రీనివాస్, పాత్రుడు, ధర్మారావు, లక్ష్మీపురంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సీహెచ్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట : వేపగుంట రామాలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని శుక్రవారం సీతారాముల పెళ్లి రాట వేశారు. రామాలయం అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేపగుంట గ్రామ పెద్ద ముత్యాలనాయుడు, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు మామిడి కిరణ్, గంట్ల దివాకర్, తేలసని కనకరాజు, బల్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న సన్నిధిలో సింహవల్లీ తాయార్, సువర్ణ, చతుర్భుజి తాయార్ అమ్మవార్ల తిరువీధి ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచి, బేడా మండపంలో తిరువీధి జరిపారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



భోజన శాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దశల వారీగా చర్యలు తీసుకుంటున్నామని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. శుక్రవారం ఆయన ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన వంటశాల, భోజన శాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యావిధానం అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం పాఠశాలలో ఇటీవల నిర్వహించిన క్రీడల్లో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శేషశైలజ

పెందుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పారదర్శకమైన ఓటర్ల జాబితాల తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల ఆర్‌ఓ శేష శైలజ కోరారు. శుక్రవారం ఆమె తహసీ ల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబితాలో పేర్లు, చిరునామా మార్పు, కొత్త ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తుల పున పరిశీలన చేయాలన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వాటిని కూడా పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డీటీ అర్జునరావు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరవధిక దీక్ష



శిబిరంలో నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెందుర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : చినముషిడివాడలోని డిఫెన్స్ కాలనీలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పీవోడబ్ల్యూ పర్యవేక్షణలో రాస్తా ఆక్రమణలు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ..నిర్వహిస్తున్న నిరవధిక దీక్ష శిబిరం శుక్రవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాలనీకి రాస్తా ఏర్పాటు చేయాలని అన్నారు.

శ్మశాన వాటిక సమస్యలపై జడ్సీ ఆరా

మల్కాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) :పారిశ్రామిక ప్రాంతంలో జోన్ 5 కమిషనర్ రాము శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మల్కాపురం శ్మశనవాటికను పరిశీలించి, అక్కడ సమస్యలపై ఆరా తీశారు. మృతదేహాల ఖనానికి గోతులలు తవ్వేటప్పుడు మరో మృతదేహం బయటపడితే వెంటనే దాన్ని పూడ్చేయాలని లేదా స్థానికంగా ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ రెండు జరగకుండా ఇష్టానుసారంగా చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత వార్డులో పలుచోట్ల తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే అన్నక్యాంటీన్‌ను పరిశీలించి అక్కడ భోజన ఏర్పాట్లు ఎలా ఉన్నాయో ప్రజలను అడిగారు. వాకర్స్ మైదానంలో పరిస్థితిలను కూడా పరిశీలించి, వాకర్స్‌తో మాట్లాడారు. 58వ వార్డులో శిథిలావస్థలో ఉన్న సులాభ్ కాంప్లెక్స్‌ను పరిశీలించి, పూర్తిగా నేలమట్టం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం పరిశీలన



పరేడ్‌ను పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విశాలాక్షినగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయుధగారం, మోటార్ ట్రాన్స్‌పోర్టు విభాగం, డాగ్ స్క్వాడ్, వీఐపీ సెక్యూరిటీ, వెల్ఫేర్ విభాగాల రికార్డులను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపర్చుకోవాలని డీఐజీ అధికారులకు సూచించారు. తొలుత పోలీసు పరేడ్ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అలానే సెరిమోనియల్ పరేడ్, స్క్వాడ్రిల్, ఆర్మ్‌డ్ డ్రిల్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. దేవప్రసాద్, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు,రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, సంజీవరావు పాల్గొన్నారు.



పార్కు అసోసియేషన్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జడ్సీ రాము

పార్కు నిర్వహణ భేష్ : జడ్సీ రాము

మల్కాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 60వ వార్డు ఎంఐజీ క్వార్టర్లలో నూతనంగా నిర్మించిన పార్కును జోన్ 5 కమిషనర్ రాము శుక్రవారం సందర్శించారు. పార్కు నిర్వహణ బాగుండడంతో నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ పార్కు అధ్వానంగా ఉండేదని, ఇప్పుడు ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తుందని చెప్పారు. పార్కు నిర్మాణానికి జీవీఎంసీ రూ. 40 లక్షలు, హెచ్‌పీసీఎల్ రూ. 40 లక్షలు వెచ్చించాయన్నారు. కార్పొరేటర్ పీవీ సురేష్, కాలనీ పెద్ద బంగారు రాజు పర్యవేక్షణలో కాలనీలో ఉన్న మహిళలు కమిటీగా ఏర్పడి పార్కు నిర్వహణ చూడడం అభినందనీయమని కొనియాడారు.

ఎనిమిది నెలల శిశువుకు గ్లకోమా కంటి చికిత్స

వేపగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఎనిమిది నెలల గిరిజన శిశువుకు వైద్యులు అరుదైన గ్లకోమా కంటి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈమేరకు ఆసుపత్రి డీజీఎం కె. బంగార్రాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరకులోయలోని బట్టివలన గ్రామానికి చెందిన పాప కంటి నుంచి నీరు కారడంతో డాక్టర్ రవీంద్ర బృందం శస్త్ర చికిత్స చేసి, చిన్నారికి చూపు ప్రసాదించారని చెప్పారు.

కమనీయం ..అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమ నీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామి వారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్యానికి సాయం నడక

చురుకుదనం పెరిగేందుకు దోహదం

అలసటను దూరం చేసే వ్యాయామం


బీచ్ రోడ్డులో ఈవినింగ్ వాక్

(బీచ్ రోడ్డు, ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యానికి ఆహ్లాదం తోడైతే ఆ మజాయే వేరు. నిత్యం కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగర జీవి స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో సువిశాల తీరం అందులోనూ ఆర్కే బీచ్ నగర పౌరుల ఆరోగ్యానికి భరోసానిస్తోంది. వ్యాయామానికి, అనుకూలమైన వాతావరణానికి ఆహ్లాదకరమైన పరిసరాలు తోడవడంతో ప్రజలు ప్రతిరోజూ తీరంలో అధిక సమయం గడిపేందుకు ప్రాముఖ్యతనిస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి రోజూ కొంత శారీరక శ్రమ అవసరం. ఉదయం జాగింగ్, రన్నింగ్ ఇతర వ్యాయామాలు చేసేందుకు అవకాశం లేనివారు కనీసం సాయంత్రం వేళ అయినా నడక సాగిస్తే ప్రయోజనాలుంటాయని నిపుణులు చెబుతున్నారు. సాయంత్రం నడక చురుకుదనాన్ని పెంచుతుంది. కొన్నిరకాల ఆరోగ్య సమస్యలను దూరం చేస్తుంది.

అలసట మాయం...

రోజంతా ఆఫీస్‌లో, ఇంట్లో వివిధ పనులు చేసిన తరువాత అలిసిపోయినట్టు ఉంటుంది. సాయంత్రం అయ్యాక ఇంటి ఆవరణ లేదా పార్కులో కనీసం ముప్పై నిమిషాలపాటు నడిస్తే అలసట దూరమవుతుంది. సాయంత్రం నడక శరీరం, మనస్సును పునరుత్తేజం చేస్తుంది. శరీరాన్ని చక్కని ఆకృతిలో ఉంచుకోవడానికి అవసరమైన వ్యాయామాన్ని అందిస్తుంది.

» ఆహ్లాదకర వాతావరణంలో వాకింగ్ మేలు

» వాకర్స్‌తో నిత్యం సందడిగా తీరం





స్పష్టత పెరుగుతుంది...

ఎండాకాలంలో చాలా మంది మధ్యాహ్నం నిద్ర పోతారు. సుదీర్ఘంగా పగలంతా కూర్చొని పని చేయాల్సి రావచ్చు. దీనివలన శరీరమంతా మొద్దుబారినట్టు, భారంగా, మబ్బుగా అనిపిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో సాయంకాలం నడక ప్రభావంతంగా పనిచేస్తుంది. నూతన చైతన్యం కలిగిస్తుంది. సరైన విశ్రాంతి, శరీరం తేలికయిన భావన కలిగిస్తుంది. స్పష్టత పెరుగుతుంది.

ప్రశాంత నిద్రకు దోహదం

పగటి పూట కంటే రాత్రి పూట నిద్ర ఆరోగ్యానికి అన్ని రకాలుగా మంచిది. నిద్ర లేమి సమస్యతో బాధ పడేవారు సాయంత్రం వేళ నడకను ఎంచుకోవాలి. దీనివల్ల ఎలాంటి సమస్యలు లేని గాఢ నిద్ర పడుతుంది. నడక కోసం సాయంత్రం కొద్ది సమయం కేటాయించగలిగితే ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. రాత్రి నిద్రించే సమయానికి ప్రతికూల ఆలోచనలు తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీనివల్ల సుఖ నిద్రకు ఉపకరిస్తుంది.

రక్తపోటును తగ్గించే ఔషధం

అంతేకాదు సాయంత్రం నడక రక్తపోటును తగ్గిస్తుంది. శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది గుండె ఆరోగ్యానికి మంచిది. ఫిట్‌గా ఉండగలుగుతారు. అలాగే రోజంతా పని చేసేటప్పుడు కండరాలపై ఒత్తిడి పడుతుంది. వెన్నునొప్పి వేధిస్తుంది. వీటన్నిటికీ సాయంకాలం నడక పరిష్కార మార్గమేనని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రయోజనాలివి...

వేసవిలో సాయంత్రం పూట వాకింగ్‌కు వెళ్లడం చాలా మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో నడక సాగించడం వల్ల సెరటోనిన్ అనే రసాయనం విడుదల అవుతుంది. దీంతో రాత్రిపూట నిద్ర బాగా పడుతుంది. సాయంత్రం వేళ వేగంగా నడవడం వలన శరీరానికి తగినంత ఆక్సిజన్ లభిస్తుంది. ఊపిరితిత్తులు, గుండె, కండరాలు ఆరోగ్యంగా పనిచేస్తాయి, మానసిక ఉల్లాసం లభిస్తుంది, మధుమేహంతో బాధపడేవారు సాయంకాలం నడకను అలవాటు చేసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయి నియంత్రణలో ఉంటుంది. రక్తపోటు సమస్య రాదు. శరీరంలోని కొవ్వులు తొందరగా కరుగుతాయి. రాత్రి భోజనం తరువాత కొద్దిసేపు నడవడం వలన కడుపులో ఆమ్లత్వం, పొట్టలో ఉబ్బరం, అజీర్ణం తగ్గుతాయి. సాయంత్రం నడవడం వలన శరీరంలో కండరాలు బలపడతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అతిగా తినాలనే కోరిక తగ్గి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జీవక్రియలు వేగవంతమవుతాయి. జీర్ణాశయ సమస్యలు తొలగిపోతాయి.

అప్పన్న కల్యాణోత్సవాల్లో ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలు ఈనెల 7న ప్రారంభమై 13 నాటి శ్రీపుష్పయాగంతో ముగియనున్నాయి. ఉత్సవ రోజుల్లో ప్రత్యేక తిరువీధులు, హోమాలు నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధన, రాత్రి ఆరాధనలతో పాటు నిత్యకల్యాణం, గరుడసేవ, స్వర్ణ పుష్పార్చన, స్వర్ణ తులసీదళార్చన, సహస్రనామార్చన, లక్ష్మీనారాయణుల వ్రతాలు తదితర ఆర్జితసేవలను పూర్తిగా రద్దుచేస్తున్నట్టు దేవాలయ స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ ప్రకటించారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 7.30 గంటల నుంచి సర్వదర్శనాలు, 12, 13 తేదీల్లో ఉదయం 8 గంటలకు సర్వదర్శనాలు, ఉత్సవాలు జరిగే రోజుల్లో రాత్రి 7 గంటల తరువాత భక్తులకు దర్శనాలు లభించవన్నారు.

అబ్బుర పరిచిన అమెరికా నౌక

టైగర్ ట్రయంఫ్‌లో పాల్గొనడానికి విశాఖ వచ్చిన అమెరికా యుద్ధనౌక కామ్‌స్టాక్ సందర్శకులను అబ్బురపరుస్తోంది. అన్ని వసతులతో అమెరికా నేవీ సిబ్బంది ఈ నౌకలో తరలివచ్చారు. లోపలి భాగాలు స్టార్ హోటళ్లను తలదన్నేలా ఉన్నాయి. విశాలమైన డైనింగ్ రూమ్, చికిత్స చేసేందుకు ప్రత్యేక ఆస్పత్రి, సువిశాలమైన కారిడార్, హెలికాప్టర్లు ల్యాండింగ్, టేకాఫ్‌కు వీలుగా హెలీప్యాడ్లు, అత్యంత ఆధునిక ఆయుధాలతో సెయిలర్లు విశాఖకు తరలివచ్చారు. వీరిలో పలువురు మహిళలు ఉన్నారు. నగరానికి వచ్చిన అనంతరం వారు సీఎంఆర్ సెంట్రల్‌లో సంప్రదాయ గోరింటాకును చేతులపై పెట్టుకుని సందడి చేశారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


విశాఖ చేరిన అమెరికా నౌక వద్ద సెయిలర్లు


నౌకలో యుద్ధ ట్యాంకర్లతో అమెరికన్ మెరైన్ ఫోర్స్


ఆధునిక ఆయుధాలతో అమెరికా సెయిలర్లు


నౌకలో హెలికాప్టర్ పరికరాలను ఉంచే ప్రదేశం

మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించాలి

» కేంద్ర మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతి


సమావేశంలో మాట్లాడుతున్న విజయభారతి

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సంపూర్ణ భద్రత, భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కేంద్ర మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయ భారతి అన్నారు. సిరిపురంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన స్త్రీ అధికార్ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి గృహ హింస బాధిత మహిళలకు బాటసగా నిలిచే స్త్రీ అధికార్ కేంద్రాన్ని ప్రారంభించారు. కుటుంబ వ్యవస్థ బలోపేతం కావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, మహిళలపై దాడులు పెరగడం తీవ్ర ఆవేదన కలిస్తున్నాయన్నారు. ఇటువంటి వాటిపై నిత్యం తమకు 500కు పైగా ఫిర్యాదులు వస్తాయని, వీటిలో 100 వరకు మహిళలకు సంబంధించినవే ఉన్నాయన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ విభిన్న ఘటనల్లో బాధితులు వస్తుంటారన్నారు. వారికి ఆశ్రయం కల్పించేలా స్త్రీ అధికార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చిన నిర్వాహకులను అభినందించారు. బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ వీసీ దొరస్వామి మాట్లాడుతూ గృహ హింస బాధిత మహిళలకు తమ సంస్థలో ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. స్త్రీ అధికార్ నిర్వాహకురాలు, సామాజిక కార్యకర్త అనిత మాట్లాడుతూ త్వరలో ఈ కేంద్రాన్ని పరవాడ వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏడు నుంచి ఎనిమిది కేంద్రాలు నెలకొల్పడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పలువురు బాధిత మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ అభ్యర్థులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నామని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమశాఖాధికారి ఎం.సత్యపద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్, బీసీ సి, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలకు ఏపీ ఈఏపీసెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ), డీఎస్సీ ప్రవేశ పరీక్షలకు నగరంలోని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఫొటో, ఆధార్ కార్డుతో సిరిపురంలోని డాల్ఫిన్ హైట్స్ అపార్టుమెంట్, ఫ్లాట్ నంబరు 308లో ఈ నెల ఆరో తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు. వివరాలకు 79931 85662, 86398 40344 నంబర్లలో సంప్రతించాలన్నారు.

ఏపీ నుంచి ఎంపీకి 15 శాతం పర్యాటకులు

» మధ్యప్రదేశ్ టూరిజం బోర్డు డీడీ వివేక్ జూడే


మాట్లాడుతున్న వివేక్ జూడే, అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌కు వచ్చే పర్యాటకుల్లో 15శాతం మంది ఆంధ్రప్రదేశ్ వారేనని ఆ రాష్ట్ర టూరిజం బోర్డు డిప్యూటీ డైరెక్టర్ వివేక్ జూడే తెలిపారు. నగరంలో ఎంపీ టూరిజం రోడ్ షోను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎంపీలో ఖజురహో వంటి శిల్పాలతో పాటు ఉజ్జయినీ వంటి పుణ్యక్షేత్రాలున్నాయని, 2028లో అర్ధ కుంభమేళా జరగనుందన్నారు. పర్యాటకులకు అవసరాలకు అనుగుణంగా ప్యాకేజీలుంటాయని, ఒక నగరం నుంచి మరో నగరానికి కేంద్ర ప్రభుత్వం ఆరుగురు కూర్చొనేలా పీఎంశ్రీ పర్యటన వాయుసేవ విమానాలు నడుపుతోందన్నారు. దేశంలో అత్యధిక పులులు, చిరుతలు కలిగిన రాష్ట్రంగా ఎంపీకి గుర్తింపు ఉందన్నారు. యునెస్కో గుర్తించిన పర్యాటక ప్రాంతాలు 14 ఉన్నాయన్నారు. పర్యాటకులు బస చేసేందుకు సుమారు 300 గ్రామాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. విశాఖపట్నం నుంచి ఇండోర్‌కు విమాన సర్వీసులున్నాయని, ఏడాది పొడవునా ఎంపీలో పర్యటించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మునీశ్ కౌశల్, రెసిడెంట్ మేనేజర్ వినోద్ జాట్ తదితరులు పాల్గొన్నారు.

62 వేలకు చేరిన సముద్ర తాబేళ్ల గుడ్లు


సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న దృశ్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంత వరకు 62 వేల సముద్ర తాబేళ్ల గుడ్లు సేకరించారు. గత ఏడాది 26 వేలు సేకరించగా 24 వేల పిల్లలు వచ్చాయి. ఈ ఏడాది ఐదువేల గుడ్ల నుంచి పిల్లలు వచ్చి ససముద్రంలోకి వెళ్లాయి. కురుసుర మ్యూజియం సమీపంలోని హేచరీస్ నుంచి 400 పిల్లలను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం సముద్రంలో విడిచిపెట్టారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజర్ పీవీ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఏడాది కురుసుర మ్యూజియం, సాగర్‌నగర్, కాపులుప్పాడ, చిననాగమయ్యపాలెం వద్ద నాలుగు హేచరీస్‌లు ఏర్పాటుచేశామని రేంజర్ తెలిపారు.

డైట్‌లో డిప్యూటేషన్‌పై అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్

భీమునిపట్నం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో అధ్యాపక పోస్టులను డిప్యూటేషన్‌పై నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని ప్రిన్సిపాల్ జ్యోతికుమారి తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో రాతపరీక్ష, 19న మౌఖిక పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు.

భవిత కేంద్రాలతో చిన్నారులకు బంగారు భవిష్యత్తు: కలెక్టర్


ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో కలెక్టర్

మహారాణిపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని, సాధారణ పిల్లలకు దీటుగా ఎదిగేందుకు పుష్కలమైన అవకాశాలుంటాయని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలను అందజేసి వారితో ముచ్చటించారు. వారితో ఫొటోలు దిగి ఆనందపరిచారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించి జ్ఞాపికలు అందజేశారు. జిల్లాలో 11 భవిత కేంద్రాల ద్వారా ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలోనే సుమారు 2,474 మంది చిన్నారులకు వివిధ సేవలందిస్తున్నామని తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సమీపంలోని భవిత కేంద్రాలకు పంపిస్తే, అక్కడ సిబ్బంది వారికి అన్ని విధాలుగా తర్ఫీదు ఇస్తారని సూచించారు. మొదటి విడతగా 106 రకాల వస్తువులను 160 మందికి అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు చంద్ర శేఖర్‌రావు, జడ్పీ సీఈవో నారాయణ మూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

కత్తితో దాడికి విఫలయత్నం


కత్తితో దాడి చేయడానికి వచ్చిన వ్యక్తి (సీసీ టీవీ ఫుటేజీలో చిత్రం)

భీమునిపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మహిళపై కత్తితో దాడికి మండలంలోని పరదేశిపాలెంలో శుక్రవారం విఫలయత్నం జరిగింది. గ్రామానికి చెందిన సంధ్యపై దంపరెడ్డి కత్తితో దాడిచేయడానికి ప్రయత్నం చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటికి వచ్చి, ఆమెను బెదిరించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను అందజేసింది. కుమార్తెతో కలిసి ఒంటరిగా జీవిస్తున్నానని, ఇంటి సమీపంలో ఉన్న 64 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని రెడ్డి ఆక్రమించడానికి ప్రయత్నిస్తే అధికారులు అడ్డుకున్నారని, దీనిపై ఫిర్యాదు చేశాననే అనుమానంతో కక్ష కట్టి చంపేస్తానని బెరించాడని, కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయన్నారు. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రక్షించారని తెలిపింది. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అప్పులు, మానసిక సమస్యలతో సతమతమవుతున్న విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాసన్స్‌బే కాలనీ, కృష్ణసాయి అపార్టుమెంటులో నివసిస్తున్న ఎన్‌డీ మిల్టన్ (64) శుక్రవారం తన ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకున్నారు. ఇతను జిల్లా సహకార రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మానసిక సమస్యలతో ఆరిలోవలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. కుమారుడు డాని రెజినాల్డ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

సీతంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామాటాకీస్ డౌన్ రోడ్డులో నివాసం ఉంటున్న ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలప్రకారం...రామాటాకీస్ డౌన్ రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న పట్నాల రాము, ఆదిలక్ష్మి నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు పట్నాల కార్తిక్ (18) ఎనిమిదో తరగతి వరకు చదివి మానేశాడు. అల్లరి చిల్లరగా తిరుతూ ఉండేవాడు. ఖర్చులు ఎక్కువ చేస్తూ తల్లిదండ్రులను డబ్బులు ఇవ్వమని అడిగేవాడు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా ద్విచక్రవాహనం కొనాలంటూ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. దీంతో వారు మందలించారు. క్షణికావేశంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు వెంటనే కార్తీక్‌ను కిందికి దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు ద్వారకా సీఐ డీవీ రమణ, ఎస్ఐ గంగాధర్ రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

పవన్ కల్యాణ్ ఆదేశమే శిరోధార్యం

» అవిశ్వాస తీర్మానంపై జనసేన కార్పొరేటర్ల స్పందన


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జనసేన కార్పొరేటర్లు, నాయకులు

సీతంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం విషయంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశమే తమకు శిరోధార్యమని ఆ పార్టీకి చెందిన 11 మంది కార్పొరేటర్లు, పీఏసీ సభ్యుడు స్పష్టం చేశారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. పీఏసీ సభ్యుడు కోన తాతారావు మాట్లాడుతూ త్వరలో కార్పొరేటర్లతో అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమావేశమవుతారని, ఆయన అభిప్రాయమే కార్పొరేటర్ల అభిప్రాయమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్, పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ల ఆదేశాలతో జీవీఎంసీ కౌన్సిల్‌లో తమ విధానం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. భిన్నాభిప్రాయాలు లేకుండా ఒకేతాటిపై ఉంటామని పేర్కొన్నారు. నగర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. జీవీఎంసీ మేయర్ పదవిపై అధిష్ఠానవర్గం మాటకు కట్టుబడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు.

స్వప్న సాగరం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్యులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏయూ తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆంగ్ల విభాగాచార్యులు ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి రచించిన నవల "స్వప్న సాగరం" పుస్తకావిష్కరణ శుక్రవారం జరిగింది. తెలుగు విభాగాధిపతి ఆచార్య అప్పారావు అధ్యక్షతన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆచార్య శంకుతల సమీక్షించారు. యోహన్‌బాబు, వెలమల సిమ్మన్న, ఈశ్వరమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన ఎన్‌రోల్‌మెంట్ పూర్తిచేయాలి

» ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ అప్పారావు


మురళీనగర్‌లో ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ అప్పారావు

విశాఖపట్నం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డుల ఎన్‌రోల్‌మెంట్ (పీఎంజేఏవై) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు ఆదేశించారు. శుక్రవారం మురళీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పీఎంజేఏవై ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం ఈ కార్డులను అందిస్తోందన్నారు. జిల్లాలో 2.9 లక్షల కార్డులను ఎన్‌రోల్ చేయాలని, అందుకు అనుగుణంగా సిబ్బంది ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా ఐదు లక్షల వరకు ఆరోగ్య బీమా లభిస్తుందన్నారు.

ఒడిశాకు ఏడు ఆర్టీసీ కొత్త బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ నుంచి శుక్రవారం ఏడు బస్సులు ఒడిశాకు ప్రారంభమయ్యాయి. ఇందులో మూడు ఎక్స్‌ప్రెస్‌లు, నాలుగు అల్ట్రాడీలక్స్ సర్వీసులున్నాయి. విశాఖ నుంచి జైపూర్ వరకు మూడు, దమన్‌జోడికి రెండు, ఒనకడిల్లీ, గుణుపూరుకు ఒక్కో బస్సు కేటాయించారు. ఆర్ఎం బి.అప్పలనాయుడు ప్రారంభించి మాట్లాడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా కొత్త బస్సులు వేశామన్నారు.

జాతీయ సీనియర్ పురుషుల హాకీ టోర్నీకి వెంకటరమణ



విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన బల్లా వెంకటరమణ పాల్గొంటారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీలో ఆంధ్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నీలో ఆడనున్నాడు. హాకీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కేతు అప్పారావు, ఆంజనేయరావు, గోపాలకృష్ణ, రాంజీ, ప్రతినిధులు అభినందించారు.